

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

ఉత్తరాంధ్ర
మంగళవారం 6-8-2024 పేజీలు 6

విశాఖ - అనకాపల్లి - అల్లూరి - మన్యం
విజయనగరం శ్రీకాకుళం


# నేడే ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



**విశాఖపట్నం, ఆగస్ట్ 5, మేజర్‌న్యూస్:** స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉప ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ ఆగష్ట్ 6న విడుదల కానుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులకు తెలిపారు. నోటిఫికేషన్ జారీ నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందని, 13వ తేదీ వరకు కొనసాగుతుందని ( ప్రభుత్వ సెలవు దినములు మినహా ) కలెక్టర్ చెప్పారు. ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రక్రియపై సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ ఉదయం 11.00గం.ల నుంచి మధ్యాహ్నం 03.00గం.ల వరకు ఉంటుందని తెలిపారు. ఈ ఎన్నికల్లో విశాఖ జిల్లాతో పాటు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన జెడ్.పి.టి.సిలు, ఎం.పి.టి.సిలు, మునిసిపాలిటీ సభ్యులు ఓటరుగా పాల్గొననున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారిగా, జాయింట్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా, జిల్లా రెవిన్యూ అధికారి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించిన ప్రకటన గత నెల 30న విడుదల అయిందని, అప్పటి నుంచే ఎన్నికల కోడ్ అమల్లో ఉందని కలెక్టర్ వివరించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ ఆగస్టు 6న, నామినేషన్ల స్వీకరణ ఆగస్టు 13వ తేదీ వరకు ఉంటుందని అన్నారు. 14 వ తేదీన స్క్రూటినీ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. స్క్రూటినీ సమయంలో అన్ని సక్రమంగా ఉంటే ఆ నామినేషను దాఖలు చేయడం జరుగుతుందని, లేనిచో తగిన కారణాలతో నామినేషనును తిరస్కరించడం జరుగుతుందని ఆయన వివరించారు. 16వ తేదీ మధ్యాహ్నం 03.00గం.ల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని, అనంతరం ఎన్నికల బరిలో ఉన్న తుది అభ్యర్థుల వివరాలను నిర్ధారించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆ తదుపరి బ్యాలెట్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని, ఈ ఎన్నికల్లో ఈవిఎంలు ఉండబోవని, బ్యాలెట్ బాక్సులను వినియోగించడం జరుగుతుందని కలెక్టర్ గుర్తుచేశారు. ఆగస్టు 30 వ తేదీ ఉదయం 8.00 గం.ల నుంచి సాయంత్రం 4.00 గం.ల వరకు పోలింగ్ ఉంటుందని, పోలింగ్ కేంద్రాల వివరాలు రెండు రోజుల్లో తెలియజేస్తామని అన్నారు. గతంలో నిర్వహించిన పోలింగ్ కేంద్రాల్లోనే ఈసారి ఎన్నికలు నిర్వహించేలా జిల్లా యంత్రాంగం అభిప్రాయపడుతున్నట్లు మిగతా 2లో

# బొత్సను ఓడించేందుకు టీడీపీ కీలక భేటీ

## హాజరైన స్పీకర్ అయ్యన్న, ఎంపీ రమేష్, ఎమ్మెల్యేలు



**విశాఖపట్నం, ఆగస్ట్ 5, మేజర్‌న్యూస్:** స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి తీరాలని తెలుగుదేశం పార్టీ వ్యూహ రచన చేస్తోంది. ఈ మేరకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అభ్యర్థి ఎంపికపై నేతలు కసరత్తు ప్రారంభించారు. సోమవారం గాజువాకలోని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ఇంట్లో టీడీపీ ముఖ్య నేతలంతా కీలక భేటీ అయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి పార్టీ తరఫున పోటీ చేసేందుకు విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు గండి బాబ్జీ ఇప్పటికే సన్నద్ధమయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత చంద్రబాబు, లోకేశ్‌లను కలిసి అవకాశం ఇవ్వాలని కోరారు. తాజాగా అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ బరిలో నిలిచేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇంకా మాడుగుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ కూడా తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. కాగా బీజేపీ నుంచి గ్రామాధికారుల సంఘం మాజీ నేత ఈర్లె శ్రీరామమూర్తి పోటీకి ఆసక్తి చూపుతున్నారు. ఈ నెల ఆరో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్నందున అభ్యర్థిని త్వరగా ఎంపికచేయాలని అధిష్ఠానం సూచించింది. ఇప్పటికే వైసీపీ నుంచి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పేరు ప్రకటించడంతో టీడీపీ తరఫున అభ్యర్థి ఎంపికకు సోమవారం రాత్రి గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఇంట్లో ఉమ్మడి జిల్లా ఎంపీలు, ఎమ్మెల్సీలు, శాసనసభ్యులు విశాఖ, అనకాపల్లి, అరకు పార్లమెంటు అధ్యక్షులు భేటీ అయ్యారు. కలెక్టర్ల సదస్సుకు హాజరవుతున్నందున హోంమంత్రి అనిత హాజరుకాలేదు.

**బొత్సను ఎలాగైనా ఓడించాలి..!**

ఉత్తరాంధ్ర నేతగా పేర్గాంచిన బొత్స సత్యన్నారాయణను ఎలాగైనా ఓడించాలని టీడీపీ వ్యూహాలు సిద్ధం చేస్తోంది. అందులో భాగంగానే గాజువాకలో ఈ కీలక భేటీ జరిగింది. స్పీకర్ అయ్యన్న పాత్రుడు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ప్రధానంగా అరకు, పాడేరు వైఎస్‌ఆర్సీపీ ఎంపీటీసీ లు, జెడ్పీటీసీ లపై టీడీపీ ఫోకస్ పెట్టింది. ఈ సమావేశానికి ఏజెన్సీ కి చెందిన 60 మంది వైఎస్ఆర్సీపీ ఎంపీటీసీ, జెడ్ పీ టీ సీ లను ఆహ్వానించింది. అలాగే మిగతా 2లో

## కోర్బా ఏసీ కోచ్ దగ్ధంపై

# ఉన్నత స్థాయి కమిటీ విచారణ

### అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్న కమిటీ



**విశాఖపట్నం, ఆగష్టు 5, మేజర్‌న్యూస్:** కోర్బా ఎక్స్‌ప్రెస్ ఏసీ బోగీ దగ్ధం సంఘటనకు సంబంధించి సోమవారం విచారణ ప్రారంభించారు. ఆదివారం ఉదయం ఈ ఘటన విశాఖ రైల్వే స్టేషన్‌లో జరిగిన సంగతి తెలిసిందే. ప్రయాణీకులకు ఎలాంటి ప్రమాదం లేకపోయినా సరే ఈ కేసును రైల్వే అధికారులు సీరియస్‌గానే తీసుకున్నారు. రైల్లో అన్ని సరఫరాలను నిలిపివేసి బోగీల తలుపులు మూసిన తర్వాత కూడా అగ్ని ప్రమాదం జరిగి క్షణాల్లో భోగీ మొత్తం దగ్ధం కావడాన్ని అధికారులు లోతైన దర్యాప్తు చేసేందుకు నిర్ణయించారు. రైల్లోని ఎయిర్ కండిషన్డ్ కోచ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై దర్యాప్తు చేసేందుకు సూరత్ జానీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ఎస్సీ బెహెరా చీఫ్ రోలింగ్ స్టాక్ ఇంజనీర్, బీఎస్ నాథ్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్‌లతో కూడిన ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఈస్ట్ కోస్ట్ రైల్వే ఏర్పాటు చేసింది.

ఈ కమిటీ ఆదివారం రాత్రి విశాఖపట్నం చేరుకుంది. వారంతా సోమవారం ఉదయమే స్టేషన్ యార్డ్ మెయింటెనెన్స్ డిపోలోని కోచ్‌ను పరిశీలించి విచారణ ప్రారంభించారు. రైల్వే అధికారులు, సిబ్బంది, స్టేషన్ సిబ్బందితో మాట్లాడారు. కోచ్‌ను తయారు చేసిన చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ నుండి ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ఆర్‌డీఎస్‌ఓ లక్నో నుండి ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కూడా వివరణాత్మక సాంకేతిక విశ్లేషణ కోసం విశాఖపట్నం చేరుకున్నారు. రాష్ట్ర ఫోరెన్సిక్ బృందం కూడా ఆగస్టు 4న కోచ్‌ని తనిఖీ చేయడం ద్వారా దర్యాప్తు ప్రారంభించింది. దర్యాప్తు వేగంగా జరుగుతోందని పురోగతిలో ఉందని రైల్వే అధికారులు తెలిపారు.

# రేషన్ సరకుల పంపిణీలో అన్యాయం చేయొద్దు

## మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఈఏఎస్ శర్మ లేఖ



**విశాఖపట్నం, ఆగస్ట్ 5, మేజర్‌న్యూస్:** రేషన్ సరకుల పంపిణీలో అన్యాయం చేయొద్దని ఇంధన శాఖ మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ పేర్కొన్నారు. ఈ మేరకు ఏపీ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు సోమవారం శర్మ ఓ లేఖ రాశారు. గత ప్రభుత్వం అమలు చేసిన రేషన్ సరకుల పంపిణీ పథకం వల్ల రాష్ట్రంలో వందలాదిమంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, కుటుంబాలకు ఉపాధి లభించిందని గుర్తు చేశారు. అయితే వాటిల్లో కొంతమంది అతిపేద ఆదివాసీలు (పీవీటీజీ) కూడా ఉన్నారని, అటువంటి పథకాన్ని కూటమి ప్రభుత్వం వచ్చే నెల నుంచి రద్దు చేస్తున్నట్టు తనకు సమాచారం వచ్చిందని దయజేసి అలా చేయొద్దని శర్మ కోరారు. ఆ పథకాన్ని రద్దు చేస్తే నష్టపోయేది పేదల్కెన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కుటుంబాలేనని గుర్తు చేశారు. వారికి ఉపాధి పోతే, వారి మిగతా 2లో

# త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తికావాలి

## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



**విశాఖపట్నం, ఆగస్ట్ 5, మేజర్‌న్యూస్:** ఆనందపురం మండలంలోని గొట్టిపల్లి, చందక గ్రామాల్లో నిర్మితమవుతున్న గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తికావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ గుత్తేదారులకు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంట్, నీటి సరఫరా కొరత లేకుండా చూస్తామని, రానున్న మూడు మాసాల్లో నిర్మాణాలు పూర్తికావాలని కలెక్టర్ ఆదేశించారు. సోమ వారం ఉదయం విశాఖ రూరల్, భీమిలి, ఆనందపురం మండలాలను జిల్లా కలెక్టర్ పర్యటించారు. ఆనందపురం మండలం గొట్టిపల్లి రెవిన్యూ గ్రామంలోని సర్వే నెంబర్ 20,23, చందక గ్రామంలోని సర్వే నెంబర్ 4లో వేసిన గృహ మిగతా 2లో

# వినతుల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలి

## -అర్జీదారుల సంతృప్తికర అంశాలను పరిశీలించాలి -డిఆర్ఓ జి కేశవరావు నాయుడు



**పార్వతీపురం, ఆగష్టు 5, మేజర్‌న్యూస్:** వ్యయ ప్రయాసలకు ఓర్చి సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులు అధికారులకు మొరపెట్టుకుంటారని క్షేత్రస్థాయిలో ఆయా పరిస్థితులను క్షుణ్ణంగా గమనించి సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని అర్జీదారుల సంతృప్తికర అంశాలను గమనంలోకి తీసుకొని అందరికీ సమన్యాయం జరిగేలా ముందుకు పోవాలని జిల్లా రెవెన్యూ అధికారి జి కేశవరావు నాయుడు స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవ నాయుడు, ఆర్.డి.ఒ. కె. హేమలత ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ ప్రజలు అందించిన అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై అర్జీలు అందజేసారు. 148 అర్జీలు పరిష్కారం నిమిత్తం ప్రజలు అందజేసారు. సీతానగరం గ్రామానికి చెందిన నాగవరపు వీరభద్రుడు గత ఆదివారం పాము కాటుతో మరణించారని, అతనికి ప్రభుత్వం నుండి వచ్చే ఆర్థిక సహాయం అందజేసి తన కుటుంబాన్ని ఆదుకోవాలని కుమారుడు నాగవరపు రాజారావు దరఖాస్తు అందజేశారు. శ్రీకాకుళం వెళ్లే రోడ్డుకు ఆనుకుని ఉన్న మిత్ర రియల్ ఎస్టేట్ యాజమాన్యం బంటువానివలస గ్రామం లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని, గ్రామం నుండి వచ్చే మురుగునీరు, వర్షం నీరు కూడా బయటకు వెళ్లకుండా మట్టి వేసి అడ్డుకుంటున్నారని, తోటపల్లి నిర్వాసితులకు కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుని స్థలాలను అక్రమంగా అమ్ముకుంటున్నారని, నిర్వాసితులకు కేటాయించిన గ్రామ దేవతలు స్థలం కూడా కబ్జా చేశారని, తోటపల్లి రిజర్వాయర్ కోసం సర్వం కోల్పోయిన మాకు, మా గ్రామానికి జరుగుతున్న అన్యాయాన్ని, మిత్ర రియల్ ఎస్టేట్ యాజమాన్యం చేస్తున్న భూ కబ్జాతో పాటు మిగతా 2లో

# కొండవాలు ప్రాంతాలలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచండి

## జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్



**విశాఖపట్నం, ఆగష్టు 5, మేజర్‌న్యూస్:** కొండవాలు ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జోన్-5 నందు 45, 47, 53 వార్డుల పరిధిలోని వైయస్సార్ నగర్ ఎఫ్.సి.ఐ గోడౌన్ సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్ లను, కప్పరాడ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వైయస్సార్, ఎఫ్.సి.ఐ గోడౌన్ పరిధిలో ఉన్న అన్న క్యాంటీన్ పనులను పరిశీలించి, పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, అన్ని అన్న క్యాంటీన్ల లో డ్రైనేజ్ సిస్టమ్ క్రమ పద్ధతిలో మురుగు నీరు సాఫీగా పోయే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. తదుపరి కప్పరాడ లోని కొండవాలు ప్రాంతాలలోని కాలువలు, రోడ్లతో పాటు పారిశుధ్యం పనులను పరిశీలించి మరింత పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. కొండవాలు ప్రాంతాలలో



కాలువల నందు వ్యర్థాలు లేకుండా నిత్యం పర్యవేక్షించాలని, ఈ ప్రాంతంలో దుకాణాదారులు, వీధి వ్యాపారులు కాలువలలో వ్యర్థాలు వేయకుండా వారికి అవగాహన కల్పించాలన్నారు. పలుచోట్ల వీధిలైట్లు లేనందున ఆ ప్రాంతంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, పూర్తిగా పాడైన మరామ్మత్తుకు గురైన కాలువలకు మరమ్మతులు చేపట్టాలని పర్యవేక్షక ఇంజినీరు వేణు గోపాలరావు ను ఆదేశించారు. ఆ ప్రాంతం లో భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థ లేనందున, నివాసితులు ఎప్పటికప్పుడు మురుగు నీటిని తరలించుకునేలా అవగాహన మిగతా 2లో

# గ్రామాల్లో మౌలిక సదుపాయాలుపై దృష్టి సారించాలి

## -ఆగస్టు 15న అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తాం -త్వరలో తాను కూడా ఆకస్మిక తనిఖీలు చేస్తా -జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడి

**శ్రీకాకుళం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** గ్రామాల్లో మౌళిక సదుపాయాలు పై దృష్టి సారించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 15న అన్నా క్యాంటీన్లు ప్రారంభించనున్నట్లు చెప్పారు. త్వరలో తాను కూడా ఆకస్మిక తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. సంపద సృష్టించాలని, వినూత్నంగా ఆలోచించాలన్నారు. రిమోట్ ఏరియాలకు కూడా వెళ్ళి అక్కడ సమస్యలను తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో లిప్రైమరీ సెక్టర్స్:లి వ్యవసాయం, మార్కెటింగ్, కోపరేటివ్, పశు సంవర్థక, ఉద్యానవన, ఆక్వా, మత్స్య, ఫారెస్టు శాఖలు. లినేచురల్ రిసోర్సెస్:లి కింద భూగర్భ గనులు, వాటర్ రిసోర్సెస్. లిసెకండరీ సెక్టార్/ఇన్ఫ్రాస్ట్రక్చర్:లి ఇండస్ట్రీస్, హేండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్మెంట్, విద్యుత్, రవాణా, ఆర్ అండ్ బి శాఖలు, లిహ్యూమన్ రిసోర్స్:లి స్కూల్ ఎడ్యుకేషన్, హయర్ ఎడ్యుకేషన్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, ఎంప్లాయ్ మెంట్ అండ్ స్కిల్ డెవలప్ మెంట్, లిసోషల్ సెక్టార్/వెల్ఫేర్:లి సోషల్/ట్రైబల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్/ఈడబ్ల్యూఎస్, మైనార్టీ వెల్ఫేర్, ఉమెన్ అండ్ చిల్డ్రన్ వెల్ఫేర్, సివిల్ సప్లయ్స్, లిహెల్త్ సెక్టార్‌లి హెల్త్ అండ్ సీజనల్ కండీషన్స్, లిఅర్బన్/రూరల్ డెవలప్‌మెంట్‌లి: మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, సిఆర్డీఏ, పిఆర్ అండ్ ఆర్డీ (ఉపాధి హామీ, సెర్ప్, ఆర్డబ్ల్యుఎస్), హౌసింగ్, లిసర్వీస్ సెక్టార్:లి టూరిజం, యూత్ అండ్ స్పోర్ట్స్, ఐటిఈ అండ్ సి, లిరెవెన్యూ డిపార్ట్‌మెంట్:లి రెవెన్యూ (లాండ్స్, రిజిస్ట్రేషన్లు అండ్ స్టాంప్స్), ఎక్సైజ్ శాఖలు, లా అండ్ ఆర్డర్ లపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శాఖల వారీగా సమీక్షించారు. ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయా శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. జిల్లా నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఇన్ చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, జిల్లా పరిషత్ సీఈవో వెంకటేశ్వరరావు, డిపిఓ వెంకటేశ్వరరావు, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్, డ్వామా పీడీ చిట్టిరాజు, వ్యవసాయ శాఖ జెడి శ్రీధర్, ఆర్ అండ్ బి ఎస్ఈ మిగతా 2లో

## టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి, వైసీపీకి..

# గ్రేటర్ 'స్థాయీ' ఎన్నిక ప్రతిష్టాత్మకమే..!

### -వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్న ఇరు పార్టీలు
### -బలా బలాలు విశ్లేషిస్తే..
### టీడీపీకి 49, వైసీపీకి 47
### -ప్రలోభాలకు గురిచేస్తే.. ఆ పార్టీకి ఫలితం ఏకపక్షమే!



పిఎరావు
(సూర్య ప్రతినిధి-విశాఖపట్నం)

గ్రేటర్ 'స్థాయీ' ఎన్నికలు... కూటమి, వైఎస్సార్‌సీపీకు ప్రతిష్టాత్మకం మారింది. 'స్థాయీ'లోను అన్ని స్థానాలను చేజిక్కించుకొనేందుకు 'కూటమి' అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే వైఎస్సార్‌సీపీకి చెందిన ఏడుగురు కార్పొరేటర్లను టీడీపీ చేర్చుకోగా... మరో ఐదుగురు కార్పొరేటర్లను జనసేన చేర్చుకోనుంది. జనసేన పార్టీలో కార్పొరేటర్ల చేరిక మంగళవారం చేపట్టనున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ కూడా అప్రమత్తమైంది. తమ పార్టీ కార్పొరేటర్లను కాపాడుకొనేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి రంగంలోకి దిగారు. ఈ నెల 7వ తేదీన జరిగే 'స్థాయీ' ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకొనేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. కాగా, 'స్థాయీ'లోని పది స్థానాలను కూడా కైవసం చేసుకోవడమే లక్ష్యంగా కూటమిలోని మిగతా 2లో

# నేడే ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. సెప్టెంబర్3న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందని కలెక్టర్ వెల్లడించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజకీయ పక్షాలు, సంబంధిత శాఖల అధికారులందరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాల్సిందిగా ఆయన కోరారు. ఈ సమయంలో కొత్త కార్యక్రమాలు గాని, శంకుస్థాపనలు గాని ఉండరాదన్నారు. కోడ్ అమలులోకి వచ్చినందున వెంటనే అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో ఉన్న రాజకీయ నాయకుల చిత్రపటాలు, పోస్టర్లు, బ్యానర్లు ఉండదని చెప్పారు. ఎన్నికలతో సంబంధం ఉన్న ఏ ఒక్క అధికారి జిల్లాలో గాని, ఇతర జిల్లాల్లో గాని రాజకీయ నాయకులకు సంబంధించిన ఎటువంటి సమావేశాలకు హాజరు కాకూడదని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్,. ఇన్ ఛార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి టి.సీతారామమూర్తి, వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ సరకుల పంపిణీలో అన్యాయం చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్తు ఏమైపోవాలనే విషయాన్ని ఆలోచించాలన్నారు. వారికి ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పించే పథకాన్ని ప్రవేశపెట్టే నిర్ణయం కూడా తీసుకోవాల్సిన బాధ్యత కూడమి ప్రభుత్వానికి ఉందన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న రేషన్ సరకుల పంపిణీ పథకంలో కొన్ని లోపాలున్నాయని, యి. ఉదాహరణకు, ఈ పథకం కింద ఇచ్చిన వాహనాల బీమా ఖర్చు భారం లబ్ధిదారులపైనే పడుతున్న కారణంగా వారు అప్పులపాలవుతున్నారని పేర్కొన్నారు. ఆ పథకం అమలు తీరును సమీక్షించి, లోపాలు లేకుండా అమలు చేస్తే కూటమి ప్రభుత్వానికే మంచిపేరొస్తుందన్నారు. రేషన్ సరకుల పంపిణీ పథకాన్ని మరింత మెరుగుపర్చి మీ ప్రభుత్వం అమలు చేయాలని, ప్రస్తుత లబ్ధిదారుల్కైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కుటుంబాలకు నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి మనోహన్‌కు రాసిన లేఖలో శర్మ స్పష్టం చేశారు.

# గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలి

(మొదటి పేజీ తరువాయి)

జాన్ సుధాకర్, మత్స్య శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అప్పికొండ రామారావు నాయుడు, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ జిజె బెన్హర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కొండవాలు ప్రాంతాలలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచండి

(మొదటి పేజీ తరువాయి)

కల్పించాలన్నారు. కొండవాలు ప్రాంతంలో నివాసాలు అధికంగా ఉన్నందున పారిశుద్ధ్య విధి నిర్వహణకు వయస్సు పైబడిన పారిశుధ్య కార్మికులకు వేరొక ప్రాంతాలకు మార్పిచేసి సమర్థలైన పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేసి తద్వారా పారిశుద్ధ్య పనులను వేగవంతం అయ్యేలా చూడాలని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి క్రిష్ణ ను కమీషనరు ఆదేశించారు. ఈ పర్యటనలో కార్యనిర్వాహక ఇంజినీర్ మత్స్యరాజు, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు ప్రసన్న, సహాయక వైద్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్, ఏసిపి వెంకటేశ్వరరావు, హార్టికల్చర్ అధికారి అర్చన, శానిటేషన్, ఎమినిటీస్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# తెర్లాంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**తెర్లాం, ఆగస్టు 5, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని తెర్లాం వెలగవలస పనుకువలస అంగన్వాడి కేంద్రాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బాడంగి ఐసిడిఎస్ సిడిపిఓ కె రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగింది.ఈ సందర్భంగా సిడిపిఓ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి తల్లి పుట్టిన బిడ్డకు విధిగా తల్లిపాలు పట్టాలన్నారు ఆరు నెలల వరకు తల్లిపాలు ఆ బిడ్డకి ఇవ్వాలన్నారు. ఎలాంటి ఇతర ద్రవ పదార్థాలు పిల్లలకు పట్టకూడదని ఆమె అన్నారు.తల్లిపాలు విశిష్టత పైన అనేకమైన సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా బాలింతలకు గర్భిణీలకు ఆకుకూరలు కాయగూరలు ప్రదర్శన ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. అలాగే సూపర్వైజర్ ఉషారాణి తల్లిపాల పైన పలు సూచనలు అందించారు. కార్యక్రమం లో వీరితోపాటు అంగనవాడి కార్యకర్తలు వై శ్రీదేవి జి లక్ష్మి సిహెచ్ కృష్ణవేణి పలువురు కార్యకర్తలతో పాటు ఆయాలు ఏఎన్ఎంలు వైద్య సిబ్బంది ఆశా వర్కర్లు గర్భిణీలు బాలింతలు ప్రీ స్కూల్ పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# 19, 20వ తేదీల్లో వీపీజేఏ ఫోటో ప్రదర్శన

## పోస్టర్ను ఆవిష్కరించిన జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్



**విశాఖపట్నం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** విశాఖ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో (విపీజేఏ) ఈనెల 19, 20 తేదీలలో నిర్వహించనున్న 185వ వరల్డ్ ఫోటోగ్రఫీ డే పోస్టర్ను సోమవారం ఉదయం జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్ కుమార్ ఆవిష్కరించారు. జీవీఎంసీ సహకారంతో ప్రతి ఏటా బీచ్ రోడ్ విశాఖ మ్యూజియం లో అట్టహాసంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 19వ తేదీన ఉదయం 10:30 గంటలకు రెండు రోజుల ఫోటో ఎగ్జిబిషన్ ప్రారంభించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పీఎన్. మూర్తి, కార్యదర్శి జి తిరుపతిరావు ఈ సందర్భంగా వెల్లడించారు. విశాఖ ఫోటో జర్నలిస్టులు ఈ ఏడాదిలో తన కెమెరాలో బంధించబడిన అద్భుతమైన చిత్రాలను ప్రదర్శించనున్నారని చెప్పారు. రెండు రోజులపాటు విశాఖ వాసులతో పాటు, విజ్ఞానాన్ని వినోదాన్ని అందించే ఈ ఫోటో ఎగ్జిబిషన్ ను ప్రముఖుల చేతుల మీదగా ప్రారంభించి రెండు రోజులపాటు వివిధ పాఠశాల నుండి విద్యార్థులు, యువత, పర్యాటకులు కూడా సందర్శిస్తుంటారని వెల్లడించారు. పోస్టర్ ఆవిష్కరణలో విశాఖ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# బొత్సను ఓడించేందుకు టీడీపీ కీలక భేటీ





(మొదటి పేజీ తరువాయి)

అమరావతిలో క్యాంపునకు వీరందరినీ తరలించేందుకు సైతం టీడీపీ సన్నాహాలు చేస్తోంది. దాదాపు 25 రోజుల పాటు క్యాంపును కొనసాగించేందుకు టీడీపీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీలా గోవింద్ పేరు దాదాపు ఖరారు అయినట్టుగా ప్రచారం జరుగుతోంది. ఆర్థికంగా ను గోవింద్ సరైన అభ్యర్థి కావడంతో అవకాశం ఇవ్వాలని టీడీపీ నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. బొత్స ను ఎలాగైనా ఓడించాలన్న లక్ష్యం తో ముందుకు వెళ్తున్న టీడీపీ నేతలు అందుకు తగ్గ అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

# త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తికావాలి



(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణాల లే అవుట్ పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని గుత్తేదారులను, గృహ నిర్మాణ, రెవిన్యూ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణాలకు సిమెంట్ కొరత లేదని, నీటి సరఫరా, ఇసుక సమస్యను పరిష్కరిస్తామని గుత్తేదారులకు కలెక్టర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని, అధికారులు, సిబ్బంది, వర్క్ ఇన్ స్పెక్టర్లు అధిక ప్రాధాన్యత ఇస్తూ అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. అంతకుముందు విశాఖ రూరల్ ఋషికొండ పరిధిలోని రామానాయుడు స్టూడియో వద్ద గల ప్రభుత్వ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం భీమిలి ఇసుక డిపోను కలెక్టర్ సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నూతన ఉచిత ఇసుక సరఫరా విధానం పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. ప్రజల అవసరాలకు తగిన విధంగా ఇసుకను నిల్వ చేసుకోవాలని, సజావుగా, సులభతరంగా ఉచిత ఇసుక సరఫరా కావాలని పేర్కొన్నారు. ఇసుక డిపోలో నిల్వలు గురించి గనుల శాఖ ఉప సంచాలకులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో గృహ నిర్మాణ శాఖ పీడీ డి.అఖిల, గనుల శాఖ డీడీ డా. డిఇవిఎస్ఎస్ ఎన్ రాజు, తహసీల్దార్ శ్యాంప్రసాద్,ఎంపీడీఓ అప్పలనాయుడు, ఈఈ సత్యనారాయణ, డీఈలు రామకృష్ణ, సూర్యప్రకాశ్, సీతారాం, ఏఈ సూర్యప్రకాశ రావు, ఇతర ఏఈలు,వర్క్ ఇన్స్పెక్టర్లు,ఎమినిటీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



## టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి, వైసీపీకి..

# గ్రేటర్ 'స్థాయీ' ఎన్నిక ప్రతిష్టాత్మకమే..!

(మొదటి పేజీ తరువాయి)

పార్టీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. సాధారణ ఎన్నికల అనంతరం జరిగే తొలి ఎన్నిక జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నిక కావడంతో.. ఆ పార్టీలకు చెందిన అత్యున్నత నాయకులుతో పాటు స్థానికంగా వున్న నాయకులు కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్టు తెలుస్తోంది. అన్ని స్థానాలను కూటమి పరం చేసేందుకు టీడీపీ ఎమ్మెల్యేలతో పాటు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ తన శాయశక్తులు ఒడ్డుతున్నట్టు తెలుస్తోంది. మరోపక్క వైఎస్సార్‌సీపీ అధిష్టానం కూడా ఈ ఎన్నికను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్టు తెలుస్తోంది. 'స్థాయీ'లోని పది స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా... కూటమి చేస్తున్న ప్రలోభాలకు గుణపాఠం చెప్పాలనే యోచనలో వున్నట్టు తెలుస్తోంది. ఇదిలావుండగా.. బలం పరంగా వైఎస్సార్‌సీపీకి వున్నా.. ఇటీవల కాలంలో వైఎస్సార్‌సీపీలో వున్న కొందరు కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. మంగళవారం కూడా మరికొందరు కార్పొరేటర్లు జనసేన తీర్థం పుచ్చుకొనేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఏ పార్టీకి ఎంతమంది కార్పొరేటర్లు వున్నారనే అంశంపై దృష్టిసారిస్తే... వాస్తవంగా వైఎస్సార్‌సీపీకి 58, టీడీపీకి 29, జనసేనకు పార్టీ నుంచి ముగ్గురు, స్వతంత్రులు ఇద్దరు మొత్తం ఐదుగురు, సీపీఎం, సీపీఐ, బీజేపీకి ఒక్కొక్క కార్పొరేటరు వుండే వారు. ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలతో... వైఎస్సార్‌సీపీలో వున్న 58 మందిలో ఎనిమిది మంది టీడీపీలో చేరగా.. మరో ఐదుగురు కార్పొరేటర్లు మంగళవారం జనసేన పార్టీలో చేరనున్నట్టు తెలుస్తోంది. మొత్తం 13 మంది కూటమిలో చేరడంలో ఆ కూటమిలో వున్న కార్పొరేటర్ల సంఖ్య.. టీడీపీలో చేరిన కోడిగుడ్ల పూర్ణిమను తగ్గిస్తే.. 41గా వుండగా.. ఒక స్వతంత్ర్య సభ్యుడైన విల్లూరి భాస్కరరావుతో కలిపి ఆ సంఖ్య 42గా వుంది. వీటికి జనసేన కార్పొరేటర్లు ముగ్గురు, ఈ పార్టీలో గతంలో చేరిన ఇద్దరితో కలిపి మొత్తం ఐదుగురు కార్పొరేటర్లు వున్నారు. ఈ ఐదుగురితో పాటు కూటమిలో వున్న బీజేపీకి ఒకరు, స్థాయికి మద్దతిచ్చిన సీపీఐ సభ్యుడితో కలిపి ఇద్దరున్నారు. మొత్తం 97 మంది కార్పొరేటర్లలో కూటమికి 49 మంది కార్పొరేటర్ల బలం వుండగా.. వైఎస్సార్‌సీపీకి 47 మంది బలం వున్నట్టు తెలుస్తోంది. మరో సభ్యుడైన సీపీఎంకి గంగారావు 'స్థాయీ' ఎన్నికకు దూరంగా వుండే అవకాశముంది. అంటే... ప్రస్తుత బలా బలాలను చూసుకంటే కూటమి వైపు 49 మంది వుండగా.. వైఎస్సార్‌సీపీకి 47 మంది వున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. ఈ బలా బలాలు నేపథ్యంలో... అధికార, ప్రతిపక్షాలకు ఈ 'స్థాయీ' ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారిందనే చెప్పొచ్చు. ప్రలోభాలకు గురై.. కార్పొరేటర్లు ఈ ఎన్నికల్లో ఎవర్ని గెలుపిస్తారో వేచిచూడాలి.

# వినతుల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి గ్రామస్తులకు తగు న్యాయం చేయాలని బంటువానివలస గ్రామానికి చెందిన పి. సీతంనాయుడు మరియు గ్రామస్తులు దరఖాస్తు అందజేశారు. పాచిపెంట మండలం అల్లంపాడు గ్రామంలో గిరిజనులు కొండపై జీవిస్తున్నామని, గ్రామంలో అంగన్వాడి కేంద్రం లేక ఇబ్బంది పడుతున్నామని, గ్రామానికి ఆనుకొని కందివలస, బోరబంద రెండు గ్రామాలు ఉన్నాయని, మా గ్రామంలో అంగన్వాడి సెంటర్ ఏర్పాటు చేస్తే మా పిల్లలకు పౌష్టికాహారం అందుతుందని బి.సన్యాసి మరియు గ్రామ ప్రజలు వినతి పత్రం సమర్పించారు. పాచిపెంట మండలం మెలియాకంచూరు పంచాయతీకి సరైన రహదారులు లేవని, ప్రజలు రాకపోకలకు చాలా ఇబ్బంది పడుతున్నారని, వర్షాలు పడితే ఎక్కడపడితే అక్కడ నీరు నిల్వ ఉండిపోతుందని దాని వలన దోమలు ఎక్కువగా వస్తున్నాయని, కేరంగి జంక్షన్ నుండి దొర్లబండి వరకు, కొండమోసూరు నుండి అల్లంపాడు వరకు రోడ్డు మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ వినతి పత్రం సమర్పించారు. పాచిపెంట మండలం కేరంగి గ్రామపంచాయతీ లో కప్పరాయి, కొండమోసూరు,కేరంగి మూడు గ్రామాలకు ఆశా వర్కర్లు లేరని, గర్భిణీ స్త్రీలను చూసుకోవడానికి ఎవరూ లేరని, గ్రామానికి ఏఎన్ఎంలు ఎప్పుడో వస్తారని గ్రామాలకు ఆశా వర్కర్లు లేక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని, మా గ్రామాలకు ఆశా వర్కర్లను నియమించి ప్రజల ఇబ్బందులు తీర్చవలసిందిగా గ్రామ సర్పంచ్ సోముల లచ్చయ్య అర్జీ అందజేశారు. బలిజిపేట మండలం మురగడాం గ్రామానికి చెందిన ఆర్. విజయ మురగడాం గ్రామంలో విలేజ్ ఆర్గనైజర్ గా పని చేస్తున్నానని, ఎటువంటి కారణం లేకుండా రాజకీయ ఒత్తిడితో తనను తొలగించడం జరిగిందని, దర్యాప్తు జరిపించి ఉద్యోగం తిరిగి ఇప్పించాలని దరఖాస్తు సమర్పించారు. పార్వతీపురం మండలం జమదాల గ్రామం నుండి భూపతి ఈశ్వరరావు తన డి-పట్టా భూమిని పెంటసూరి,బోసిక ఉగాది ఆక్రమించారని వారితో విఆర్ఓ,సర్వేయర్ కుమ్మకై భూమిని వారి పేరున రాయాలని బెదిరిస్తున్నారని తన భూమిని తన పేరు మీద పాస్ పుస్తకం ఇప్పించవలసిందిగా కోరుతూ దరఖాస్తు అందజేశారు. తదితర సమస్యలతో అర్జీదారులు విన్నవించుకోగా పరిష్కారానికి సంబంధిత అధికారులకు సిఫారసు చేయడం జరిగింది. జిల్లా కలెక్టర్ ఇతర ఉన్నతాధికారుల సూచనల మేరకు సత్వర చర్యలకు సంబంధిత శాఖ అధికారులు అప్రమత్తమై అ జీవితాలు సమస్యలు పరిష్కరించాలని డిఆర్ఓ కోరడం కనిపించింది. కార్యక్రమంలో ఆర్డీవో కే హేమలత వివిధ శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వయనాడ్ బాధితుల సహాయార్థం విరాళాలు

**అరకులోయ, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** కేరళలోని వయనాడ్ లో కొండచరియలు విరిగిపడి బీభత్సం సృష్టించిన సంఘటనలో మృత్యువాత పడిన కుటుంబీకుల సహాయార్థం సిపిఎం విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతోంది. సిపిఎం, సిఐటియు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, కార్యనిర్వాహక సభ్యులు సంయుక్తంగా ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వ్యాపారుల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. అరకులోయ మండల కేంద్రంలో సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం, సిఐటియు రాష్ట్ర, జిల్లా, మండలస్థాయి సీనియర్ నాయకులు కిల్లో సురేంద్ర,వి.ఉమామహేశ్వర రావు, కిండంగి.రామారావు సభ్యులతో కలిసి సోమవారం దాతల నుంచి విరాళాలు సేకరించారు. తొలుత మండల కేంద్రంలోని అరకు లోయలో దుకాణాల వద్దకు వెళ్లి వ్యాపారుల నుంచి విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు కిల్లో. సురేంద్ర, వి. ఉమామహేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో సేకరించిన విరాళాలను కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపుతామన్నారు. కేరళ వయనాడ్ లో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి 300 మందికి పైగా ప్రజలు మరణించారని వారు తెలిపారు. ఈ ఘటనలో సుమారు 1700 మంది నిరాశ్రయులు అయ్యారన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రకృతి విపత్తుగా ప్రకటించి బాధితులకు అన్ని విధాలుగా ఆదుకోవాలని సురేంద్ర, ఉమామహేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం, సిఐటియు నాయకులు జె.భగత్ రాం,కె. జగన్నాథం,కె. నానిబాబు,గురుమూర్తి, కోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# ఆగస్టు 8న స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు

## మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సిహెచ్ శ్రీనివాసరావు



**కొత్తవలస, ఆగస్టు 5, మేజర్ న్యూస్:** కొత్తవలస ప్రభుత్వ నిబంధనల మేరకు ఈనెల 8వ తేదీన జరగనున్న స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించబడునని ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ చింతల శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలియజేశారు గురువారం అన్ని ప్రభుత్వ పాఠశాలల వద్ద ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు.. అయితే ఈ ఎన్నికలు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించబడతాయని తెలిపారు ఆగస్టు 8వ తేదీన ఎన్నికల నిర్వహించి ఎన్నికైన చైర్మన్లు, వైస్ చైర్మన్ల,మెంబర్లతో ప్రమాణ స్వీకారం చేయించినట్లు తెలిపారు. కనుక ప్రతి విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యి ఎన్నికలు ప్రశాంతంగా శాంతియుత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

# శ్రీముఖలింగేశ్వరునికి ఇత్తడి కవచం



**జలుమూరు, ఆగస్టు5, మేజర్ న్యూస్:** జలుమూరు మండలంలోని శ్రీముఖలింగంలో కొలువై ఉన్న శ్రీ ముఖలింగేశ్వర స్వామి గర్భగుడిలో ఉన్న గోలంకు ఇత్తడి కవచం వితరణగా అందజేశారు.సోమవారం ఈ సందర్భంగా విజయనగరం జిల్లాకు చెందిన ఎడ్ల పైడిరాజు దంపతులు కటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి విచ్చేసి వెండి కవచాన్ని గోలంతో అలంకరించారు. ఈ గోలేముకు విశేష ప్రతిష్ట ఉండడంతో వితరణ చేశామని వారు తెలిపారు. అనంతరం గోలంలో నిండుగా బియ్యాన్ని నింపి పూజలు నిర్వహించారు.

# పార్టీ కార్యకర్తల రక్షణ కోసం సభ్యత్వం అవసరం



**ఆముదాలవలస రూరల్, ఆగస్టు 5, మేజర్ న్యూస్:** మండలాల్లో అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్న జనసేన సభ్యత్వాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జనసేన పార్టీ ఉపాధ్యక్షులు పాత్రుని పాపారావు తెలిపారు. ఆమదాలవలస మండలం కొర్లకోట గ్రామంలో సోమవారం జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన సభ్యత్వం ఒక మహా యజ్ఞం లా సాగుతుందని వివరించారు. జనసేన సభ్యత్వం తీసుకున్న జన సైనికులు ఏదైనా ప్రమాదంలో మరణించినట్లయితే 5 లక్షలు ఇన్సూరెన్స్ ఉంటుందని అన్నారు. అలాగే ఏదైనా ప్రమాదంలో క్షతగాత్రులై ఆసుపత్రిలో చేరితే ఖర్చుల నిమిత్తం 10 వేలు నుండి 50 వేలు వరకు ఇవ్వడం జరుగుతుందని అన్నారు.అంతేకాకుండా పాక్షికముగా అంగవైకల్యం అయితే రూ. 2.5 లక్షల రూపాయలు జనసేన పార్టీ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని జనసైనికులు గ్రామాల్లో సభ్యత్వ నమోదు పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పేడాడ అప్పలనాయుడు, పేడాడ ప్రసాదరావు పాల్గొన్నారు.

# యస్ సి వర్గీకరణ పై సుప్రీం తీర్పు పునః పరిశీలించాలని ఆందోళనకొత్తూరు



**కొత్తూరు, ఆగస్టు 05, మేజర్ న్యూస్:** యస్ సి వర్గీకరణ పై సుప్రీం ఇచ్చిన తీర్పును పునః పరిశీలించాలని కోరుతూ యస్ సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కొత్తూరు నాలుగు రోడ్లు కూడలి లో ఆందోళన చేపట్టారు.ఈసందర్భంగా దళిత మహాసభ అధ్యక్షులు టోంపల తిరుపతిరావు మాట్లాడుతూతీర్పు అమలు చేసే ముందు రాష్ట్ర ప్రభుత్వాలు పరిశీలించాలని కోరారు. నాల్గు రోడ్ల కూడలిలోసుమారు అర గంట కాలం చేపట్టిన ఆందోళన లోభాగంగా మానవ హారం ఏర్పడి నిరసన తెలియ జేశారు.నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఆందోళన చేయడంవల్ల ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అంద జేశారు.కార్యక్రమంలో పడాల నాగభూషనరావు,బొడ్డుపల్లికృష్ణారావు, మహిళా నేత త్రినాదమ్మ, వడమ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ లైబ్రరీని ప్రారంభించిన ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి



**లక్కవరపుకోట, ఆగస్టు 05, మేజర్ న్యూస్:** ఎల్.కోట మండలం, చందులూరు గ్రామంలో గల జడ్పీహెచ్ ఉన్నత పాఠశాలలో సోమవారం సాహసం ట్రస్ట్ వ్యవస్థాపకులు మాకవరపు గణేష్ సహకారంతో సహసం డిజిటల్ హబ్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీని శృంగవరపుకోట నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి ఉపాధ్యాయులందరు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రాజెక్ట్ చైత్ర లో భాగంగా వెనుకబడిన తరుగతులకి చెందిన విద్యార్థినికి ఉన్నత చదువులు వరకు చదివించే బాధ్యతను తీసుకొనే ధ్రువీకరణ పత్రాన్ని లలిత కుమారి గారి చేతుల మీదుగా సదరు విద్యార్థినికి అందించడం జరిగింది. అలాగే పాఠశాలలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రైజ్ మనీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎల్.కోట మండల పార్టీ అధ్యక్షులు చొక్కాకుల మల్లునాయుడు, మాజీ జెడ్పిటీసీ కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ కొల్లి రమణమూర్తి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, నాయకులు, మహిళలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక పాయింట్‌ను పరిశీలిస్తున్న

# తహసీల్దార్ ఎం. శ్రీను



**బొబ్బిలి, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** గ్రోత్ సెంటర్ లో గల ఇసుక స్టాక్ పాయింట్ ను తహశీల్దార్ ఎమ్. శ్రీను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక తరలింపు విషయం లో ఎటువంటి విమర్శలకు తావులేకుండా సక్రమంగా పంపిణీ చేయాలని సంబంధించిన అధికారులు ను ఆదేశించారు. అలాగే ప్రాధాన్యత క్రమంలో మొదటి వచ్చిన వాహనాలలో ఇసుకను లోడ్ చేయాలని మిగతా వాహనాలన్నీ బయటనే ఉండేటట్లు చూసుకోవాలని సూచనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కాలనీ అభివృద్ధి సంఘం నూతన కమిటీ ఎన్నిక



**విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** బీసీ కాలనీ డెవలప్మెంట్ సొసైటీ నూతన కార్యవర్గం వివరాలు ఇలా ప్రకటించారు. అధ్యక్షులుగా రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ పి ప్రభాకర్, సలహాదారులు రిటైర్డ్ ఎమ్మార్వో పేడాడు జనార్ధన్ రిటైర్డ్ హిందీ మాస్టర్ వెంకటాచారి రిటైర్డ్ ఏఎస్ఐ పోలాకి శంకర్రావు , అధ్యక్షులుగా పివిఆర్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ పత్తిగుల్ల వెంకట్రావు ఉపాధ్యక్షులుగా కృష్ణారావు ప్రధాన కార్యదర్శిగా సునీత డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ రేజేటి సత్య రావు జాయింట్ సెక్రటరీగా రిటైర్డ్ ఆర్మీ సువ్వాడ నారాయణరావు ట్రెజరర్ తాత్రాజు రమణ, బి వెంకటరావు ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్స్ కళ్యాణపు శ్రీనివాస్ పొట్నూరి ప్రసాద్ కార్యవర్గం సభ్యులుగా ఆటో విష్ణు నెంబర్, లక్ష్మణరావు, ఎల్ఐసి కృష్ణమూర్తి, సన్యాస అప్పలనాయుడు, ఆర్టీసీ గణేష్, సూరిబాబు, పక్కి ప్రసాద్, శ్రీనివాస్, నర్సింగ్ రావు, టైలర్ రాజు స్టిక్కరింగ్ ఈ సభ్యులను కార్యవర్గ సభ్యులుగా నియమించారు.

## కలెక్టర్ల సదస్సులో ఆన్లైన్ ద్వారా పాల్గొన్న జెసి కార్తీక్




**విజయనగరం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** రాష్ట్ర రాజధాని అమరావతిలో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సోమవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో, జిల్లా నుంచి జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ఆన్లైన్ ద్వారా పాల్గొన్నారు. ఈ సదస్సులో నిర్వహించిన వివిధ శాఖల సమీక్షను, కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలునుంచి తిలకించారు. జెసితో పాటు వివిధ శాఖల అధికారులు కూడా పాల్గొన్నారు.

## భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం



**భీమునిపట్నం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సోమవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సి. హెచ్. సూర్య ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన తల్లిదండ్రుల ఉద్దేశించి విద్యార్థులు క్రమశిక్షణ, వేషధారణ, హెయిర్ స్టైల్, డ్రెస్సెన్స్, డ్రగ్ అబ్యూస్ మొదలగు విషయాలపై ప్రసంగించారు. ఈ సమావేశంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డకు బలవర్ధకం

### -శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ -బలగ సెక్టార్ భావాజీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు



**శ్రీకాకుళం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో ముఖ్యమని, బలవర్ధకమని తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, రోగనిరోధక శక్తిని పెంచుతుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. నగరంలోని బలగ సెక్టార్ భావాజీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నాలుగో వార్డు ఇంచార్జ్ రెడ్డి సూర్యనారాయణ, రెడ్డి శంకర్ ల ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ బిడ్డకు పాలివ్వడం వలన తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అదేవిధంగా తల్లికి రొమ్ము క్యాన్సర్ లాంటివి రావని ఆమె సూచించారు. శిశువుకు మొదటి ఆరు నెలల వరకు తల్లిపాలే ఆహారంగా అందించాలని, ఎటువంటి ద్రవ పదార్థాలు అందించవద్దని సూచించారు. చిన్నారులకు డబ్బా, పాల ప్యాకెట్ల పాలు పట్టించొద్దని తెలిపారు. చిన్నారుల్లో తల్లిపాలతోనే వ్యాధి నిరోధకశక్తి లభిస్తుందని జీర్ణవ్యవస్థను మెరుగు పరిచి, ఎదుగుదలను పెంచుతుందని తెలిపారు. గర్భిణిగా ఉన్న సమయంలో మంచి పౌష్టిహారాన్ని తీసుకోవాలని ద్వారా చెప్పారు. మాతాశిశు మరణాలను తగ్గించేందుకే ప్రతీ ఏడాది ఆగస్టు 1 నుంచి 7 వరకు తల్లిపాల వారోత్సవాలను ప్రతీ ఏడాది నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బిడ్డకు పాలివ్వడం వలన తల్లికి కూడా లాభాలున్నాయన్నారు. ప్రసవంలో తల్లి బరువు ఎక్కువ పెరుగుతుందని పాలివ్వడం వలన బరువు తగ్గుతారని చెప్పారు. రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, రక్తపోటు, టైప్ 2 మధుమేహం వంటి రోగాలు భవిషత్తులో రాకుండా అడ్డుకుంటాయని వివరించారు. భవిష్యత్తులో బిడ్డలకు రోగాలు రాకుండా కాపాడటంలో తల్లి పాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో శోభారాణి, టీడీపీ నాయకులు చిట్టి నాగభూషణం, తంగి నర్సింగరావు, రెడ్డి ఆమని, సాదు కోటి, సాద్ పరమేశు, కోలా చిరంజీవి,సాదు అజయ్, తంగి గణేష్, రావాడ పురుషోత్తం, కెవిఎస్ నాయుడు, మురళి, సచివాలయం సిబ్బంది అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు సమీక్షలో జిల్లా కలెక్టర్లు



**పార్వతీపురం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం అమరావతి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ జిల్లాల కలెక్టర్ల సమావేశాన్ని చేపట్టారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సి ఎస్ నిర బ్ ఇతర మంత్రుల సమక్షంలో చేపట్టిన కలెక్టర్ల సమావేశానికి పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ హాజరయ్యారు. జిల్లా పరిధిలోని అవసరాలను అవకాశాలను ఈ సందర్భంగా కలెక్టర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోగా ప్రస్తుతం చేపడుతున్న కార్యక్రమాలు చేపట్టాల్సిన విధివిధానాలపై ముఖ్యమంత్రి చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా జిల్లా ప్రగతికి అవసరమైన అంశాలపై సుదీర్ఘంగా సమావేశంలో రాష్ట్ర యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది.

## బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలి

### విజయనగరం జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్



**విజయనగరం క్రైమ్, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ సిస్టం) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ ఆదేశాలతో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ ఆగస్టు 5, సోమవారం నాడు నిర్వహించారు. ప్రజలనుండి ఫిర్యాదుదారుల నుండి అదనపు ఎస్పీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను వివరించి, వారి పట్ల సానుకూలంగా స్పందించాలని, పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ కార్యక్రమంలో భాగంగా అదనపు ఎస్పీగారు 35 ఫిర్యాదులను స్వీకరించారు. వీటిలో కుటుంబ కలహాలకు సంబంధించినవి 8 ఫిర్యాదులు, భూ తగాదాలకు సంబంధించినవి 17 ఫిర్యాదులు, మోసాలకు పాల్పడినట్లుగా 3 ఫిర్యాదులు, ఇతర విషయాలకు సంబంధించినవి 7 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ ఆదేశించారు. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, 7దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని అధికారులను అదనపు ఎస్పీ శ్రీమతి అస్మా ఫర్హీన్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీమతి అస్మా ఫర్హీన్ విజయనగరం డిఎస్పీ శ్రీ ఆర్.గోవిందరావు, ఎస్బీ సిఐ ఈ. నర్సింహమూర్తి, డిసిఆర్బి సిఐ శ్రీ జె. మురళి, డిసిఆర్బి ఎస్ఐలు మురళి, గణేష్ మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నాయకులు చెప్తున్నారు.. విధులనుంచి తొలగిస్తా..?

### వివో ఏలపై ఏపిఎం ఆగ్రహం



**పార్వతీపురం రూరల్, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** సక్రమంగా విధులు నిర్వహించి, రికార్డింగ్ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచుకోకపోతే ...ఇప్పటికే అనేకసార్లు పంచాయతీ స్థాయిలోని నాయకులు మీలాంటి వారిని విధులనుంచి తొలగించి కొత్తవారికి అవకాశం ఇవ్వాలని తనపై ఒత్తిడి తీసుకొస్తున్నారని ఇదే పొరపాటు మరోసారి జరిగితే విధుల నుంచి తొలగించాల్సి వస్తుందని స్థానిక ఐకెపి ఏపిఎం పువ్వల సురేష్ కుమార హెచ్చరించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివో ఏ మరియు సి.సి లకు మా శాంతపు సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి హాజరైన వివో ఏ లపై ఏపిఎం సురేష్ కుమార చిందులేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఉన్నతాధికారులు తనిఖీలకు వచ్చినవేల తుమ్మితే ఓడిపోయే మీ ఉద్యోగాలు చూసి తమపై అధికారులు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. గ్రామస్థాయిలో మహిళా సంఘాలకు చైతన్య పరుస్తూ, తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించడంతోపాటు రికార్డులను పూర్తిస్థాయిలో ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకోవాలని లేకపోతే విధులనుంచి తొలగిస్తానన్నారు. ఇప్పటికే మండలంలోని అనేక పంచాయతీల్లో అవకతవకలు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఈ విషయంలో నాయకుల సూచన మేరకు వివో ఏ నుంచి తొలగించాల్సి వస్తుందని ఏపిఎం అనడం వివాదాస్పదంగా మారింది. ఏపీ ఎం మొక్క మాటలు వింటుంటే నాయకులకు కొమ్ముకాస్తున్నార...? లేక విధులు నిర్వహిస్తున్న వివో ఏ లకు పరోక్షంగా హెచ్చరిస్తున్నారన్న అనుమానాలు కలుగుతున్నాయి. వాస్తవానికి మండల పరిధిలో ఐదు క్లస్టర్లలో సుమారు 36 మంది వివోఏ మహిళలు ఉన్నారు. వీరందరూ ఆయా పొదుపు సంఘాలను చైతన్య పరుస్తూ ప్రభుత్వ పథకాలు వారికి సక్రమంగా అందేలా చూస్తూ బ్యాంకు రుణాలు మంజూరులో కీలకంగా వ్యవహరిస్తున్నారు. అయితే సమావేశాల్లో అధికారులు మహిళలు అని కూడా చూడకుండా వారిపై చిందులేస్తూ హెచ్చరికలు జారీ చేయడం విచారకరం. వ్యవస్థలో చిన్న చిన్న లోటుపాట్లు సహజమైనప్పటికీ ఏపిఎం తీరు మాత్రం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ విషయంలో ఉన్నత అధికారులు దృష్టి సారించిన అవసరం ఎంతైనా ఉంది.

## త్వరితగతిన అర్జీలను పరిష్కరించాలి

### -ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులు 172 -జిల్లా రెవిన్యూ అధికారి ఎం.అప్పారావు



**శ్రీకాకుళం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** ప్రజలు సంతృప్తి చెందేలా, త్వరితగతిన అర్జీలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఇంచార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి ఎం. అప్పారావు అన్నారు. సోమవారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) మీకోసం కార్యక్రమం జిల్లా రెవిన్యూ అధికారి అధ్యక్షతన జరిగింది. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి 172 అర్జీలను స్వీకరించిన ఇంచార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి అప్పారావుతో పాటు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ వెంకట్రామన్, సర్వ శిక్ష అభియాన్ ఏపీసి జయప్రకాష్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్ మెంట్ ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి అర్జీదారులు తమ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఇంచార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి వారికి అర్జీలు సమర్పించారు. మీకోసం ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక కార్యక్రమం డిసిహెచ్ఎస్ డా రాజ్యలక్ష్మి, వైద్య ఆరోగ్య శాఖ, డిఆర్డిఏ, డ్వామా, విద్యాశాఖ, విద్యుత్తు, ల్యాండ్ సర్వే, పోలీసు, ఉద్యానవ వివిధ శాఖల ద్వితీయ శ్రేణి అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు



**అరకులోయ, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** తల్లిపాలు ఆవశ్యకత, విలువలను తెలియపరచడంలో భాగంగా అరకులోయ మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆగస్టు నెల మొదటి వారంలో నిర్వహిస్తున్న మాదిరిగానే ఈ ఏడాది కూడా ఐసిడిఎస్ అరకులోయ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడి కేంద్రాలలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని హట్టగుడ, పద్మాపురం, ఎండపల్లివలస, జనంగుడ గ్రామాలకు చెందిన అంగన్వాడి కేంద్రాలలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను కన్నుల పండువగా జరిపారు. గర్భిణీలు బాలింతలు గిరిజన మహిళలందరినీ ఆయా అంగన్వాడి కేంద్రాలలో హాజరుపరిచి బిడ్డకు తల్లిపాలు అందించే విధానంపై అవగాహన కల్పించారు.

అంతకుముందు గ్రామాలలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం అరకులోయ ప్రాజెక్ట్ అధికారిణి కె.శారద మాట్లాడుతూ పుట్టిన పసి పిల్లలకు శక్తితో పాటు, శారీరక అనారోగ్య సమస్యలు, మానసికపరమైన సమస్యలను తల్లిపాలు దరిచేరనీయవన్నారు. పిల్లలకు తల్లిపాలు ఇవ్వకుంటే భవిష్యత్తులో పలు రకాలైన ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్న విషయాన్ని తల్లులు గుర్తించాలని ఆమె కోరారు. తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహించి, సహకరించి, రక్షించుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు నెల ఒకటవ తేదీ నుంచి ఏడవ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం అరకులోయ ప్రాజెక్ట్ అధికారిణి కె.శారద తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఐసిడిఎస్ అరకులోయ ప్రాజెక్ట్ సూపర్వైజర్లు డి.అరుణశ్రీ, కె. లక్ష్మి, ఎన్వి పార్వతి,హట్టగుడ, దొరవలస, గొందివలస అంగన్వాడి కేంద్రం కార్యకర్తలు జి.విజయకుమారి,జి.బిమల,బి. కమల, ఆశ కార్యకర్త కె.డొమిని, గర్భిణీలు, బాలింతలు, గిరిజన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం




**నరసన్నపేట, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** పెద్దపేట అంగన్వాడీ కేంద్రంలో తల్లి పాలు వారోత్సవాల భాగంగా సోమవారం అంగన్వాడీ కార్యకర్త గొల్లంగి పుణ్య వతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎంపీటీసీ సభ్యులు పీస కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం ఎంతో శ్రేయస్కారమని తల్లి పాలు వలన రోగనిరోధక శక్తి వస్తుందని, ఆరోగ్యవంతమైన బిడ్డగా ఎదుగుదలకు దోహదపడతాయని అన్నారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహార పదార్థాలతో కూడిన కిట్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య కార్యకర్తలు కోరాడ రామచంద్ర, బెవర శివకుమార్, ముద్దాడ చిన్నారావు, సతివాడ.నందేశ్వరరావు, కోట అప్పలస్వామి,వి.శాంతారావు, ఎం. అప్పలనాయుడు సూరపు. సురేష్, రెడ్డి. సింహాచలం, వైద్య ఆరోగ్యశాఖ సబ్ సెంటర్ స్టాఫ్ నర్స్ యమున , మహిళా పోలీస్ భాగ్యలక్ష్మ, అంగన్వాడి కార్యకర్తలు ముచ్చ సంధ్యారాణి, ఆర్, సంధ్య, బంటుపల్లి. త్రిపుర సుందర బాలమణి, శోభారాణి, డోల మహాలక్ష్మి, పాల్గొన్నారు.

## అరకులోయలో వర్గీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ

**అరకులోయ, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** ఎస్సీల వర్గీకరణకు వ్యతిరేకంగా అరకులోయ మండల కేంద్రంలో మాల మహానాడు కమిటీ సోమవారం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించింది. వర్గీకరణను వ్యతిరేకిస్తున్న ఈ ప్రాంతంలోని కొందరు నిరసన ప్రదర్శన చేపట్టారు. అంతేకాకుండా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి ఎస్సీల వర్గీకరణను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ వర్గీకరణ ఎస్సీ ఐక్యతను దెబ్బతీసే విధంగా ఉందని పలువురు వాదిస్తున్నారు. మాల మహానాడు కమిటీ ప్రతినిధి, స్థానిక న్యాయవాది రత్నరాజు ఆధ్వర్యంలో వర్గీకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు భూపతి లెనిన్ రాజు, చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.



## రెవెన్యూ సమస్యలే అధికం

### ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 265 అర్జీలు



**విజయనగరం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** ఈ వారం కూడా రెవెన్యూ శాఖకు సంబంధించిన వినతులే అధికంగా వచ్చాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా, సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి. అనిత ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 265 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంభందించి 130, పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డిఆర్డిఏకు 87 వినతులు అందాయి. ఇంకా విద్యాశాఖకు సంభందించి 4, మున్సిపాలిటీకి 10, విద్యుత్ శాఖకు 8, హౌసింగ్ కు 1, పంచాయితీ శాఖకు 12, గ్రామ వార్డు సచివాలయాలకు సంభందించి 6, వైద్య ఆరోగ్య శాఖకు 5, డిసిహెచ్ఎస్ 2 వినతులు వచ్చాయి. వీటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని డియార్వో కోరారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మురళీకృష్ణ, సుమబాల కూడా వినతులు స్వీకరించగా, వివిధ శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలో.. నేను సైతం

### క్షేత్రస్థాయిలో పర్యటించిన ఎమ్మెల్యే సతీమణి



**పార్వతిపురం రూరల్, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** పట్టణంలోని పలు శివారు వార్డుల్లో ఎమ్మెల్యే సతీమణి అనూష పర్యటించారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు నేను సైతం అంటూ ఆమె ఆ పార్టీ కార్యకర్తలను కలిసి సోమవారం కొత్తవలస ప్రాంతంలో పర్యటించి వీధి వీధుల్లో తిరిగి పారిశుధ్యం తాగునీరు ఏ విధంగా అందుతుంది అన్నదానిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయా వార్డు ప్రజలతో మమేకమయ్యారు. మహిళలు ఏ విధమైనటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని అలాగే ఓటమి ప్రభుత్వంతో రాష్ట్ర మరింత అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. కొత్తవలస ప్రాంతంలోని పలు కాలనీలకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో కాలువలు సిసి రోడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అలాగే రాత్రివేళలో వీధి దీపాలు వెలక్క వర్షాకాలం అంధకారంలో గడపాల్సి వస్తుందని కాలనీవాసులు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. విపరీటల్లో ఆమె వెంట అవార్డు కౌన్సిలర్ నారాయణరావుతో పాటు తెదేపా కార్యకర్తలు ఉన్నారు

## ఆదమరిస్తే అంతే సంగతి

### -పడిపోతారేమో..? చూసి వెళ్ళండి
### -మండల పరిషత్ ప్రధాన గేటు వద్ద పరిస్థితి ఇది

**నరసన్నపేట, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** నరసన్నపేట మండల కేంద్రం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయం ఆవరణలోని గేటు వద్ద డ్రైనేజ్ పై ఉన్న పలక విరిగి ప్రమాద భరితంగా మారింది . అది గమనించిన స్థానికులు పచ్చని కొమ్మను డ్రైనేజీలో విరిగిన పలక చెంత ఉంచడం విశేషం. పలు ప్రభుత్వ కార్యాలయాలకు ప్రధాన మార్గమైన మండల పరిషత్ ప్రధాన గేటువద్ద ఉన్న పరిస్థితి చూసి స్థానికులు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇంజనీరింగ్ కార్యాలయం, మండల విద్యాశాఖ కార్యాలయం, మండల అభివృద్ధి కార్యాలయం, వెలుగు కార్యాలయం, శాఖా గ్రంధాలయం, సచివాలయం, ఐసిడిఎస్ కార్యాలయం మొదలగు వాటికి ప్రధాన రహదారిగా ఉన్న ఈ ప్రాంతంలో ప్రధాన గేటు వద్ద ఆదమరిస్తే అంతే సంగతి, వాహన ప్రమాదం సంభవించవచ్చు. ఇన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ప్రతిరోజు వందల సంఖ్యలో ప్రజలు వచ్చిపోతూ ఉంటారువాహనాల రద్దీ కూడా అంతేలా ఉంటుంది. ప్రధాన కార్యాలయాల చెంత ఉన్న గేటు,రోడ్డు పరిస్థితి ఇలా ఉండడంపై స్థానికులు, ప్రజలు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి వెంబడి ఉన్న వీధులకు కలిపే రహదారుల వద్ద పరిస్థితి వాహనదారులకుఇబ్బందికరంగానే ఉంది. పోలీస్ స్టేషన్ రోడ్, పాత బస్టాండ్ శివాలయం, నేతాజీ వీధి, స్టేట్ బ్యాంకు రహదారి ప్రాంతాలలో పరిస్థితులు ఇంకా దారుణంగా ఉన్నాయి.స్థానిక నేతాజీ వీధి ముఖ ద్వారం వద్ద పెద్ద గొయ్యి ఏర్పడి వాహనదారులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రతిరోజు ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. ద్విచక్ర వాహనాలు పడిపోవడం వాటి నడిపే వారికి దెబ్బలు తగలడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనాఅధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## కేంద్ర మంత్రులను కలిసిన ఎమ్మెల్యే రమణమూర్తి



**నరసన్నపేట, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రివర్యులు అశ్విని వైష్ణవ్ ను, కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి వర్యులు శ్రీకింజరాపు రామ్మోహన్ నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. నరసన్నపేట నియోజకవర్గంలోని పలుఅభివృద్ధి పనులు, రాజకీయపరమైన అంశాలు చర్చించారు.

## సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

### ఏఎస్పిఓ దిలీప్ కిరణ్



**పార్వతీపురం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో పోలీస్ శాఖ అలసత్వం వహించక సత్వర చర్యలకు సిద్ధపడాలని అప్పుడే ఫిర్యాదుదారుల అభిలాష నెరవేరుతుందని అలా కాకుండా అలసత్వం ప్రదర్శిస్తే ఫిర్యాదుదారులకు నష్టం జరగడంతో పాటు క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి అడ్డుకట్టు ఏర్పడుతుందని జిల్లా ఎస్పీ ఓ దిలీప్ కిరణ్ స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం తన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో 8 మంది ఫిర్యాదుదారులు తమ తమ సమస్యలను విన్నవించుకోగా పరిష్కార నిమిత్తం సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి చర్యలు గైకొన్నారు. సోమవారం నాటి కార్యక్రమానికి కుటుంబ కలహాలు భూ ఆస్తి వివాదాలు ఆన్లైన్ మోసం అధిక వడ్డీ ఇబ్బందులు సైబర్ మోసాలు అత్తారింటి వేధింపులు తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి ఎస్ఐ గోవిందరావు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధిపై అధికారులతో సమీక్ష



**అనందపురం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** మండలంలోని గ్రామపంచాయతీ అభివృద్ధిపై ఎన్ ఐ ఆర్ డి ప్రతినిధి సమీక్ష సమావేశం నిర్వహించారు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ ప్రతినిధి కే నాగరాజు పాల్గొని మాట్లాడుతూ గ్రామపంచాయతీ ప్లాను లక్ష్యాలు ఏ విధంగా జరుగుతున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు గ్రామాలలో మౌలిక వసతులు కల్పన దిశగా పనిచేయాలన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నీలం అప్పలనాయుడు ఈవోపీ ఆర్డీ రామారావు మండల ఇంజనీరింగ్ అధికారి వెంకటేశ్వర్లు జిల్లా ప్రాజెక్టు అధికారి కే రాజేష్ గ్రామ కార్యదర్శులు శ్రీరామ్మూర్తి, ఎం సతీష్ తదితరులు పాల్గొన్నారు

## పంచాయతన దేవాలయంలో హరికథ ప్రారంభం



**అనకాపల్లి, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** శ్రీ గౌరీ పంచాయతన దేవాలయంలో శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా ఆలయ మండపంలో సోమవారం తిరుపతి వాస్తవ్యురాలు, శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ కళాకారిణి, గాన కోకిల హరికథ సామ్రాజ్ రాణి సువర్ణ హస్తాకంకణా ఘన సన్మాన గ్రహీత డాక్టర్ వనారస విజయ కుమారి భాగవతారిణిచే శ్రీమత్ మహాభారతంలో మొదట అధ్యాయం ఆదిపర్వం హరికథ ప్రారంభమైంది. ముందుగా వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు), ఆలయ కమిటీ సభ్యులు, ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు కర్రి సన్యాసి నాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, ఆళ్ల మహాలక్ష్మి నాయుడు, మళ్ల సూర్య ప్రకాష్ రావు, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల డ్యూటీ సర్టిఫికేట్లను ఇప్పించాలని వినతి పత్రం



**నర్సీపట్నం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** నర్సీపట్నం ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఎన్నికల డ్యూటీ సర్టిఫికేట్ ఇప్పించాలని యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షులు పీ. గాయత్రి కోరారు. ఈ మేరకు నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో యూటీఎఫ్ నర్సీపట్నం డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. 2024 ఎన్నికల విధుల నిర్వహణ కొరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు మే 12, 13, 14 తేదీల్లో ఉపాధ్యాయులు ఎన్నికల విధుల్లో పాల్గనడం జరిగిందన్నారు. అయితే ఎన్నికల డ్యూటీ సర్టిఫికేట్ మండల తహశీల్దార్ ద్వారా ఇప్పించాల్సి ఉన్నా ఇంకా ఇవ్వలేదన్నారు. తక్షణమే వీటిని అందించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డివిజన్ నాయకులు చిట్టయ్య, నర్సీపట్నం మండల కన్వీనర్ సాంబమూర్తి, గొలుగొండ మండల ప్రధాన కార్యదర్శి శోభన్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర బడ్జెట్లో

## నిధులు కేటాయించడం హర్షనీయం

### - ఎంపీ సీఎం రమేష్



**అనకాపల్లి ప్రతినిధి, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** కేంద్ర బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధికై కేంద్రం చేసిన ప్రత్యేక కేటాయింపులపై ప్రధాని నరేంద్ర మోడీ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసిన అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీ.ఎం రమేష్ . సోమవారం ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ పార్లమెంటు సభ్యులు ప్రధాని నరేంద్ర మోడీ తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ నేపథ్యం లో ఇటీవలే కేంద్ర బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు ప్రకటించినందుకు ప్రధాని నరేంద్ర మోడీ ని సహచర ఎంపీలు రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురంధేశ్వరి , మరియు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ లతో కలసి రాష్ట్ర ప్రజలు తరుపున ప్రత్యేకంగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు. అనకాపల్లి ఎం.పీ సీ.ఎం రమేష్ గారు గౌరవ ప్రధాని మోడీ ని దుశ్శలువతో సత్కరించి సహచర సభ్యులు తో కలసి వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీ.ఎం రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ పై ప్రత్యేక దృష్టి సారించిందని, ఇటు రాష్ట్రం లోనూ, అటు కేంద్రంలోనూ డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్నందున మంచి ఫలితం వచ్చిందన్నారు. ఎన్నికల ప్రచార సమయంలోనే ప్రధాని రాష్ట్రానికి హామీ ఇచ్చారని, దాన్ని నిలబెట్టుకున్నారన్నారు. భవిష్యత్తులో మరిన్ని నిధుల కేటాయింపు హామీ వలన ఆంధ్రప్రదేశ్ ఆధునిక రాజధాని నగర కల, వెనుక బడిన జిల్లాల అభివృద్ధి సాకారం కానుందని ఆశాభావం వ్యక్తం చేసారు.

## కూటమి నేతల విధ్వంసంపై అధికారులకు ఫిర్యాదు



**అనకాపల్లి, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** జగనన్న కాలనిలో కూటమి నేతల విధ్వంసం పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నామని అనకపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ అన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ అధ్యక్షతన ఘటనా స్థలాన్ని ఆయన సోమవారం పరిశీలించి బాధితులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సొంత ఇళ్లు లేని నిరుపేదలకు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చొరవతో అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న కాలనీలు నిర్మించి ఇళ్ళ పట్టాలు మంజూరు చేశారని అన్నారు. అప్పులు చేసి ఇల్లు నిర్మించుకొని నివసిస్తున్న ఇంటిపై కూటమి నాయకుల పేరుతో కక్ష్య పూరితంగా రెండు జేసీబిలతో ఇంటిని ధ్వంసం చేశారని, వివిధ శాఖల అధికారుల అనుమతులు లేకుండా ఇంటిని కూలదోయడం అన్యాయమని అన్నారు. ఈ విషయం పార్టీ ముఖ్య నేతలు, అధ్యక్షుని దృష్టిలో పెట్టామని, జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మళ్ల బుల్లిబాబు, గొర్లి సూరిబాబు, కలగా గున్నయ్య నాయుడు, మలసాల కుమార్ రాజా, మలసాల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## జోనల్ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**గాజువాక, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జోనల్ కమిషనర్ బి సన్యాసినాయుడు పాల్గొని ప్రారంభించారు. సోమవారం నాడు గాజువాక జోనల్ కార్యాలయం సమావేశ మందిరంలో వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ బి. సన్యాసినాయుడు మాట్లాడుతూ గాజువాక జోనల్ కార్యాలయం లో పనిచేస్తున్న సిబ్బంది, జోనల్ కార్యాలయంకు వివిధ పనుల మీద వచ్చిన ప్రజలుకు ఉచిత కంటి పరీక్షలు చేయించుకోవచ్చు అన్నారు. వాసన్ ఐ కేర్ వారు ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇక్కడ జరిపిన వైద్య పరీక్షల అనంతరం ఎవరికైనా మరింత పెద్ద సమస్యలు ఉంటే వాసన్ ఐ కేర్ ఆస్పత్రిలో ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చు అన్నారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 200 మందికి ఉచితం



గా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓహెచ్ డాక్టర్ ఎస్. కిరణ్, ఏసిపి శ్రీలక్ష్మి, ఏపీడి రాము,సూపరిండెంట్ ఈశ్వరి ,సింహాచలం, శివ వాసన్ ఐ కేర్ డాక్టర్లు,సిబ్బంది, అధిక సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రత అందరి బాధ్యత

### -ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాను కట్టడి చేస్తాం
### -పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి
### - రూరల్ సీఐ ధనుంజయ రావు



**అనకాపల్లి, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** అక్రమంగా ఇసుక, గ్రావెల్ తరలించడాన్ని కట్టడి చేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని రూరల్ సీఐ ధనుంజయ రావు అన్నారు. అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్లో సోమవారం ఆయన సూర్య ప్రతినిధితో మాట్లాడారు. ప్రతి రోజూ ఆయా గ్రామాల్లో పోలీసుల నిఘా ఏర్పాటు చేస్తున్నామని, కేసులు నమోదు చేస్తున్నా అక్రమ రవాణాదారులు కొత్త కొత్త మార్గాలను సృష్టిస్తున్నారని అయినప్పటికీ కట్టడి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని వాహనాని సంభందించిన పత్రాలు కూడా ఉండాలని అన్నారు. ప్రధానంగా చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు మైనర్లు డ్రైవ్ చేస్తే యాజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే పిల్లల పట్ల తలిదండ్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ముఖ్యంగా ఆడపిల్లల నడవడికను తల్లిదండ్రులు పర్యవేక్షించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు ఉన్న ఉమ్మడి కుటుంబాలు ఇప్పుడు తగ్గిపోతున్నాయని, ఒంటరి కుటుంబాల్లో నలుగురు సభ్యులు ఉన్నా తల్లిదండ్రులు కూలి పనులకోసం వెళ్లి సాయంత్రం వరకు రాకపోవడం వలన పిల్లలు ఏకాంతంలో ఉండి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు పిల్లల నడవడిక పై ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలని, పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రులు మిత్రులవలే సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు ఇస్తూ క్రమశిక్షణతో ఉండేలా చూసుకోవాలి అని అభిప్రాయపడ్డారు.

# ఎట్టకేలకు దిగి వచ్చిన ప్రిన్స్ పాల్

### -పొరపాట్లు జరిగి ఉండవచ్చు.ఇకనుంచి జరగవు -డిప్యూటీ డిఇఓ విచారణలో ప్రిన్స్ పాల్ వెల్లడి -ఇద్దరు మెరిట్ విద్యార్థులకు వెంటనే ప్రవేశం -మేజర్‌న్యూస్ కథనాలుకు స్పందన

**మెరకముడిదాం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** గర్భాం మోడల్ స్కూల్ లో జరిగే ప్రవేశాలుపై "మేజర్ న్యూస్" లో పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యం లో జిల్లా విద్యాశాఖ అధికారి ఎట్టకేలకు స్పందించారు. వారం రోజుల కిందట త్రిసభ్య కమిటీని విచారణకు నియమించిన డి ఈ ఓ ఇప్పుడు వారి ఆదేశాలతోనే,జిల్లా డిప్యూటీ విద్యాశాఖ అధికారి కె.మోహన రావు, ఏ.పి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఏ నోడల్ అధికారి ఆర్. రామ కృష్ణా రావు, మెరకముడిదాం మండల విద్యా శాఖాదికారి– 2 ధర్మ శ్రీను, త్రిషభ్య కమిటీ సభ్యుడు మెరకముడిదాం ప్రధానోపాధ్యాయులు కె.యెల్లం నాయుడులు సోమవారం మోడల్ స్కూల్ లో సుధీర్ఘ విచారణ చేపట్టారు. పలు రికార్డులు పరిశీలించి 7 రకముల అభియోగాలపై ప్రిన్సిపాల్ డి.వి.యస్ అరుణ నుండి వివరణ తీసుకున్నారు. సుమారు రెండు గంటలు పాటు జరిగిన ఈ విచారణ లో అధికారులు ప్రిన్స్ పాల్ నుండి వివరాలు నమోదు చేసుకున్నారు. వాటిని జిల్లా విద్యాశాఖ అధికారి వారికి నివేదిస్తామని డిప్యూటీ డిఈఓ మోహన రావు"మేజరు న్యూస్" కి తెలియజేసారు. ముఖ్యంగా అనర్హుల కు మోడల్ స్కూలు లో ప్రవేశం జరుగుతున్నట్లు వచ్చిన పలు ఆరోపణలపై విచారణ జరిగింది. విచారణ అనంతరం ప్రిన్స్ పాల్ డి.వి.యస్ అరుణ స్పందించారు. ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. ఇకపై మెరిట్ ప్రాతిపదికన విద్యార్థులకు ప్రవేశం ఉంటుందన్నారు. ఇద్దరు విద్యార్థులకు వెంటనే ప్రవేశం కల్పిస్తానని ప్రిన్స్ పాల్ అరుణ డీఈఓ సమక్షం లో వెల్లడించారు. ఈ విచారణకు గర్భాం ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు యస్.యస్. ఆచార్యులు రాంబాబు మాష్టారు, బైరిపురం ప్రధాన ఉపాధ్యాయులు ఎం. ఈశ్వర రావు, ఉపాధ్యాయులు రెడ్డి. లక్ష్మునాయుడు మాష్టారు, జె బి శ్రీనివాస రావు మాష్టారు లు హాజరయ్యారు.

**ఇకనుండి అనర్హులకు ప్రవేశం ఉండదు: ప్రిన్స్ పాల్:**

డి ఈ ఓ విచారణ సందర్భంగా ప్రిన్స్ పాల్ పలు విషయాలను వెల్లడించారు. ఇకపై ఆదర్శ పాఠశాలను ఆదర్శంగా నే ఉంచుతానని తెలిపారు. ఇది వరలో కొన్ని తప్పులు జరిగి ఉండవచ్చు. అయితే ఇకపై అలాంటి తప్పులు పునరావృతం



కాకుండా చూస్తానని డి ఈ ఓ ఎదుట తెలియజేశారు. ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు నా మనసును కలచివేశాయని, భావోద్వేగానికి గురి అయ్యారు. ఇకపై ఆదర్శ పాఠశాలలో మెరిట్ ప్రాతిపదికన మాత్రమే సీట్లు కేటాయిస్తానన్నారు. తక్షణమే ఇద్దరు మెరిట్ విద్యార్థులకు మోడల్ స్కూల్ లో ఈ రోజే ప్రవేశం కల్పిస్తున్నట్లు డిప్యూటీ డిఈఓ ముందు ప్రిన్స్ పాల్ మాట ఇచ్చారు. వారిలో ఒకరు శ్యామాయవలస కు చెందిన మండల.వరుణ్ కుమార్ సత్యనారాయణ కు వెంటనే ప్రవేశం కల్పించారు. కాగా,రెండో విద్యార్థి కి కబురు చేసి కూడా ఒకటి, రెండు రోజుల్లో జాయినింగ్ చేసుకుంటానని తెలిపారు. ఇదిలా ఉండగా తాము మోడల్ స్కూల్ లో చేరేందుకు సహకారం అందించిన "మేజర్ న్యూస్" సూర్య దినపత్రిక విలేఖరి కి సీటు దక్కిన విద్యార్థుల తల్లిండ్రులు కృతజ్ఞతలు చెప్పారు.

**మేజర్ సూర్య న్యూస్ వల్లే మాకు సీట్లు వచ్చాయి:**

ఇదిలా ఉండగా" మేజర్ సూర్య న్యూస్" వల్లనే మోడల్ స్కూల్ లో నాకుమారుడు వరుణ్ కుమార్ తో పాటు మరి కొందరికి సీట్లు దక్కాయని శ్యామాయవలస కు చెందిన విద్యార్ది తండ్రి మండల సత్యనారాయణ "మేజర్ న్యూస్" కు కృతజ్ఞతలు తెలియజేసారు.

# వైసీపీ విజయ ఢంఖా మోగించాలి

### -గెలుపు నల్లేరుపై నడకే
### -సమన్వయకర్త మలసాల భరత్ కుమార్

**అనకాపల్లి, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** వివిధ పాఠశాలల్లో స్కూల్ కమిటీ చైర్మన్లు, స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్లు, ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో వైసీపీ ధంఖా మోగించాలని అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ అన్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, పార్టీ ముఖ్యనేతలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సోమవారం అనకాపల్లి వైసిపి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ స్థానిక ఎమ్మెల్సీ అభ్యర్థిగా అందరికీ ఆమోదయోగ్యమైన సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పేరును అధినేత జగన్మోహనరెడ్డి ప్రకటించడం హర్షనీయమన్నారు. ఎమ్మెల్సీ స్థానం పరిధిలో వైసిపికి ఓట్లు మెజారిటీ ఎక్కువగా ఉందని, అందరం సమిష్టిగా ఉంటే గెలుపు నల్లేరుపై నడకేనన్నారు. అయినప్పటికీ, కూటమిపార్టీలో కనీస ఓట్లు లేనప్పటికీ ఎన్నికల్లో పోటీ చేస్తుండడంతో, వైసిపి ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, జెడ్పిటిసిలు కొనుగోలుకు యత్నించే అవకాశం ఉందని, దీనిపై అందరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉత్తరాంధ్ర ప్రజల గళంగా, అందరి తరపున మాట్లాడే సమర్థుడైన నాయకుడు బొత్స సత్యనారాయణను



గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీలో కూడా మనదే హవా కొనసాగాలని అన్నారు. ఈనెల 8న జరిగే స్కూల్ కమిటీ ఎన్నికల్లోనూ ఫలితాలు వైసీపీకి అనుకూలంగా వచ్చే అవకాశం ఉందన్నారు. ముందుగా గొల్లవిల్లి బాబురావుకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మలసాల రమణారావు, మలసాల కుమార్ రాజా, దంతులూరి దిలీప్ కుమార్, మళ్ళ బుల్లిబాబు, గొర్లి సూరిబాబు, కలగా గున్నయ్య నాయుడు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, జాజుల రమేష్, కొణతాల భాస్కర్, భీశెట్టి యశ్వంత్, పెంటకోట శ్రీను, పి ఎస్ ఎస్ ఎన్ జోసెఫ్, ఏవి రత్నకుమారి, నమ్మి గణేష్, ఐతా రాము, పిల్లా రాజు, కేఎం నాయుడు, విల్లూరి చంద్రశేఖర్, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లయన్ క్లబ్ సేవలు మరింత విస్తృతం

### -లయన్స్ క్లబ్ 316-ఏ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ వర్మ
### -నగర కమీషనర్ చల్లా. ఓబులేసు

**శ్రీకాకుళం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** లయన్స్ క్లబ్ సెంట్రల్ సేవలను మరింత విస్తృతం చేయాలని క లయన్స్ క్లబ్ 316–ఏ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ వర్మ, శ్రీకాకుళం మున్సిపల్ కమీషనర్ చల్లా. ఓబులేసు అన్నారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ 2024–2025 సంవత్సరానికి నియమితులైన నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం క్లబ్ జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్ అధ్యక్షతన శ్రీకాకుళంలోని ప్రవేటు అతిథిగృహంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1917లో లయన్స్ క్లబ్ ఏర్పడిందని, ప్రపంచ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలలో లయన్స్ క్లబ్ సేవలు లో ముందంజలో ఉండి ఉత్తమ క్లబ్ గుర్తింపు తెచ్చుకుందన్నారు. ముఖ్యఅతిథి గా పాల్గొన్న శ్రీకాకుళం నగర కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. ప్రపంచంలో సేవ పరంగా లయన్స్ క్లబ్ కు ప్రత్యేకస్థానం ఉందన్నారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ మాట్లాడుతూ. ఈ ఏడాది క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. తన సంపాదనలో సుమారు 20 శాతం సమాజసేవకు వినియోగించనున్నట్లు పేర్కొన్నా రు. నూతన కార్యవర్గం అధ్యక్షుడుగా డాక్టర్. బొడ్డేపల్లి సురేష్, కార్యదర్శిగా డాక్టర్ పైడి



సింధూర, కోశాధికారిగా జోగి భారతి, ఉపాధ్యక్షులుగా ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, బరాటం విశ్వేశ్వరరావు, డైరెక్టర్ పొట్నూరు నరేష్, మార్కెటింగ్ చైర్పర్సన్ ఉర్లాం శివతేజ, మెంబర్షిప్ చైర్పర్సన్ బరాటం కృష్ణచైతన్య, క్లబ్ సర్వీస్ చైర్పర్సన్ డాక్టర్ ఎం.కె. మిశ్రో ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు దుప్పల వెంకటరావు, ఎన్ని ధనుంజయరావు, పూడి తిరుపతిరావు, బలి వాడ మల్లేశ్వరరావు, సనపల.నరసింహమూర్తి, పీజే నాయుడు, అంధవరపు సంతోష్, చింతాడ రవికు మార్, లయనక్లబ్ ప్రతినిధులు నటుకుల మోహన్, పొన్నాడ రవికుమార్, బాడాన దేవభూషణరావు, హారికా ప్రసాద్ ఇతర స్వచ్చంద సంస్థ ల ప్రతినిధులు, రెడ్ క్రాస్ చైర్మన్ పి. జగన్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయండి

### : జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేంద్ర ప్రసాద్



**ఆనందపురం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** ఆనందపురం మండలంలోని గొట్టిపల్లి, చందక గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న గృహాలను త్వరితగతిన పూర్తికావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులకు , ఆదేశించారు నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంట్, నీటి సరఫరా కొరత లేకుండా చూడాలని సోమవారం ఉదయం విశాఖ రూరల్, ఆనందపురం మండలాలను జిల్లా కలెక్టర్ పర్యటించారు. ఆనందపురం మండలం గొట్టిపల్లి రెవిన్యూ ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని గృహ నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణ, రెవిన్యూ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణాలకు సిమెంట్ కొరత లేదని, నీటి సరఫరా, ఇసుక సమస్యను పరిష్కరిస్తామని గుత్తేదారులకు కలెక్టర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని, అధికారులు, సిబ్బంది,పనిచేయాలని సూచించారు. కలెక్టర్ సందర్శించారు. అవసరా పేర్కొన్నారఈ పర్యటనలో గృహ నిర్మాణ శాఖ పీడీ డి.అఖిల, గనుల శాఖ డీడీ డా. డిఇవిఎస్ఎస్ ఎన్ రాజు, తహసీల్దార్ శ్యాంప్రసాద్,ఎంపీడీఓ అప్పలనాయుడు తదితరులున్నారు.

## కార్మికులపై యాజమాన్యం చిన్నచూపు తగదు

### : మంత్రి రాజశేఖర్




**గాజువాక, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులపై యాజమాన్యం చిన్నచూపు తగదని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. సోమవారం నాడు స్టీల్ ప్లాంట్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ప్రగతికి విశేష కృషి చేస్తున్న కార్మికులపై మాత్రం యాజమాన్యం నిర్లక్ష్య దోరణి ప్రదర్శిస్తుందన్నారు. జీతాలు లేక ఇబ్బం దులు పడుతున్నారని, సంస్థలో పూర్తి స్థాయి ఉత్పత్తి జరగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంట్ను కాపాడేందుకు రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని ఆకాంక్షించారు. ప్లాంట్లో ఉద్యోగుల సంఖ్య చాలా తక్కువగా ఉందని, నియామకాలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, నాయకులు కారు రమణ, బీఎన్.రాజు, కొమ్ము ప్రసాద్, కొవిరి అవతారం బి.వేణు వర్మ, రాథోడ్, ఎస్ఏ,నాయుడు, గంగవరం గోపి తదితరులు పాల్గొన్నారు.

## బాబురావు కుటుంబానికి అండగా వైఎస్ఆర్సీపీ

### మలసాల భరత్ కుమార్



**అనకాపల్లి, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** ఇటీవలే కసింకోట మండలం బయ్యవరం గ్రామంలో కూటమి ప్రభుత్వం వేధింపులకు గురైన వైఎస్ఆర్సిపి నాయకుడు గొల్లవిల్లి బాబురావు మనస్థాపంతో ఆత్మహత్య చేసుకోవడంతో వారి కుటుంబాన్ని అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ సోమవారం పరామర్శించారు. బాబురావు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని వారి కుటుంబానికి 50,000/– రూ ఆర్థిక సహాయాన్ని భరత్ కుమార్ అందజేసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రెసిడెంట్ బొడ్డేడ ప్రసాద్, నాయకులు మలసాల రమణారావు, మలసాల కుమార్ రాజా, మళ్ల బుల్లిబాబు, గొర్లి సూరిబాబు, కలగా గున్నయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**పరవాడ, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తిని ఒక ఫార్మా పరిశ్రమకు చెందిన బస్సు పక్క నుండి ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి కింద పడిపోయాడు .వెనక నుండి వస్తున్న బైక్ అతి వేగంతో వచ్చి రోడ్డుపై పడిన వ్యక్తి పై నుండి వెళ్లడంతో రోడ్డుపై పడిన వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం లంకెలపాలెం అగనంపూడి ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది .ఈ ప్రమాదంపై స్థానిక సీఐ బాల సూర్యరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం సుమారు రెండు గంటల సమయంలో అనకాపల్లి మండలం మారేడుపూడి కాలనీకి చెందిన కోటంశెట్టి అప్పారావు అనే వ్యక్తి అతని యొక్క ద్విచక్ర వాహనంపై శ్రీరామ్ నగర్ కాలనీ వెళుతుండగా మార్గ మధ్యలో లంకెలపాలెం గవర్నమెంట్ వైన్ షాపు దాటిన తర్వాత ఎడమ వైపు తిరుగుతుండగా అదే మార్గంలో వెనుక వస్తున్న ఫార్మా పరిశ్రమకు చెందిన బస్సు డ్రైవర్ అతని యొక్క బస్సును అతివేగంగా నడుపుతూ తన యొక్క బస్సుతో సదరు ఆసామి బైక్ హ్యాండిల్ ను తగిలించడంతో సదరు ఆసామి రోడ్డు మీద పడిపోగా అతని తలకు మరియు ఇతర శరీర భాగాలకు బలమైన గాయాలు అయ్యాయని తెలిపారు. అదే సమయంలో వెనకనుంచి వస్తున్న మరొక ద్విచక్ర వాహనం సదరు వ్యక్తి పై నుండి వెళ్ళిపోవడంతో సదరు వ్యక్తి తగిలిన బలమైన గాయాల వలన అక్కడక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుని కుమారుడైన కోటంశెట్టి కనకరాజు పై ప్రమాదానికి కారణం అయిన బస్ డ్రైవరు పై తగు చర్య నిమిత్తం పరవాడ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా , మృతదేహాన్ని ఎన్టీఆర్ ఏ హాస్పిటల్ మార్చరీకి పంపించి కేసు నమోదు కేసును దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## రాష్ట్ర డిజిపిని కలిసిన జిల్లా ఎస్పీ మాధవరెడ్డి



**పార్వతీపురం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** పార్వతిపురం మన్యం జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్ర కేంద్రం అమరావతి లో జరిగిన జిల్లా ఎస్పీల సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లిన ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు గౌరవంగా కలిసి పూల మొక్కను అందజేశారు. సోమవారం ఉదయం ఈ సందర్భంగా జిల్లా శాంతిభద్రతలు పరిరక్షణ పోలీస్ వ్యవస్థ పనితీరుపై డిజిపి ఎస్పీని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాధవరెడ్డి జిల్లా పరిస్థితిని కూలంకషంగా ఆయనకు వివరించారు. అనంతరం ఈ సమావేశంలో శాంతి భద్రతల సమస్యలపైన, గంజాయి పై తీసుకున్న చర్యలు 100 రోజుల కార్యాచరణ తదితర అంశాల మీద చర్చించినారు.

## విశాఖ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులకు డాక్టరేట్



మద్రిపాలెం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్: విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల లో వివిధ విభాగాల అధ్యాపకులకు డాక్టరేట్ పురస్కారం లభించింది. కంప్యూటర్ సైన్స్ మరియు ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డా,, ఏ.ఎస్.సి తేజస్విని కోనే మొబైల్ అడహాక్ నెట్వర్క్ లో "డైనమిక్ సోర్స్ రైటింగ్ ప్రోటోకాల్" అంశంపై పరిశోధన చేసి ఆంధ్ర యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొం దారు. భౌతిక శాస్త్రం విభాగానికి చెందిన డాక్టర్ ఎం ఉదయ్ భాస్కర్ క్రిస్టల్ నేను మెటీరియల్స్ వాటి యొక్క అనువందత సాంకేతిక పరికరాలపై పరిశోధన చేసి భారతీయర్ యూనివర్సిటీ కోయంబత్తూర్ నుంచి డాక్టరేట్ పొందారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డాక్టర్ బి జీవన్ రావు నానో టెక్నాలజీలో సెమీ కండక్టర్ ఆధారిత జంక్షన్ లెస్ ట్రాన్సిస్టర్ విశ్లేషణ మీద పరిశోధన చేసి ఎన్.ఐ.టి మిజోరం యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ, ప్రిన్సిపల్ జీ.వి ప్రదీప్ వర్మ, డీన్ అకాడమిక్స్ డాక్టర్ శాంతారావు, వివిధ విభాగాల అధిపతులు, ఉపాధ్యాయులు, అధ్యాపక సిబ్బంది వారిని అభినందించారు.

## కబ్జాలకు గురువుతున్న చెరువులు రక్షణ కోసం పనిచేద్దాం

### జిల్లా అధ్యక్షులు ఐ గోపాలరావు



విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 5, మేజర్‌న్యూస్: విజయనగరం జిల్లా చెరువులు పరిరక్షణ సమితి నాయకులు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో ఉత్తరాంధ్ర చెరువులు పరిరక్షణ సమితి విజయనగరం జిల్లా అధ్యక్షులు ఐ గోపాలరావు జిల్లా ప్రధాన కార్యదర్శి తురాల శ్రీనివాస్ రావు సమక్షంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు జాగరపు ఈశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ కబ్జాలకు గురువుతున్న చెరువులు రక్షణ కోసం త్వరలో జిల్లా కార్యవర్గం వేస్తున్నామని చెరువులు రక్షణ కోసం అవగాహనా ఇష్టం ఉన్నవాళ్లు పేర్లు తెలియచేయండి అన్ని అన్నారు ఈ కార్యక్రమం ఉదేశించి విజయనగరం జిల్లా అధ్యక్షులు ఐ గోపాలరావు మాట్లాడుతూ మన విజయనగరం జిల్లాలో కబ్జాలకు గురవుతున్న చెరువులు రక్షణ కోసం ప్రతి ఒక పౌరుడు సమిష్టిగా పోరాటం చేయవలసిన అవసరం ఉందని దీనికోసం జిల్లా కమిటీలో చేరాలనుకున్నవారు మాకు ఫోన్ చేసి నేరుగా తెలియజేయగలరని కోరుకుంటు న్నాం అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పత్తిగుల్లా వెంకటరావు, జిల్లా చెరువులు పరిరక్షణ సమితి కార్యదర్శి బాలు జగదీష్ తదితరులు పాల్గున్నారు

## రావివలసలో పౌష్టికాహారం ప్రదర్శన

### -అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలు

### -హైమవతి, పద్మావతి, మంగ మ్మ, ప్రసన్నకుమారి, గౌరమ్మ, ఆధ్వర్యంలో కార్యక్రమం



గరుగుబిల్లి, ఆగస్టు 5, మేజర్‌న్యూస్: ప్రపంచ తల్లిపాలు వారో త్సవాల్లో భాగంగా మండల పరిధి లోని రావివలస గ్రామంలోని అంగ న్వాడి కేంద్రాల్లో తల్లిపాలు వారో త్సవాలు సందర్భముగా సోమ వారం పౌష్టికాహార ప్రదర్శన కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామం లోని అంగన్వాడి వర్కర్లు హైమావతి, పద్మావతి, మంగమ్మ, ప్రసన్న కుమారి, గౌరమ్మల, ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలకు సంబం ధించి ర్యాలీ నిర్వహిస్తూ కార్యక్ర మం యొక్క ఆవశ్యకతను తెలియ జేశారు. అనంత రం వారు మాట్లా డుతూ తల్లిపాలు వల్ల బిడ్డకు కలిగే ప్రయోజనాలను వివరించారు. తల్లిపాలు బిడ్డకు దివ్య ఔషధమని, అమృతంతో సమానం అని వారు తెలియజేశారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తప్పని సరిగా త్రాగించాలని కోరారు. బిడ్డ పుట్టిన రోజు నుండి క్రమం తప్పకుండా ఆరునెలల వరకు తల్లిపాలు బిడ్డకు త్రాగించాలని వివరించారు. తల్లిపాలు సంపూర్ణ ఆహారం అని అన్నారు. వీటిలో బిడ్డకు అవస రమైన అన్ని పోషకాలు ఉంటాయ ని , అలాగే వ్యాధి నిరోధకశక్తి కలుగుతుందని చెప్పారు. ఈకార్య క్రమంలో ఏ ఎన్ ఎం, ఆశవర్కర్లులు, గర్భిణీలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

## మారేపల్లిలో యువకుడు అనుమానాస్పద మృతి



దేవరాపల్లి, ఆగస్టు 5, మేజర్‌న్యూస్: మండలంలోని మారేపల్లి గ్రామానికి చెందిన క్రషర్ మెకానిక్ అల్లు అప్పారావు (39) అనుమానస్పద మృతి చెందాడు. మృతుడి భార్య దుర్గ లక్ష్మీ, ఎస్సై డి.నాగేంద్ర కథనం ప్రకారం క్రషర్ మెకానిక్ కోసం ఇంటి నుంచి శనివారం వెళ్ళిన అప్పారావు తిరిగి రాలేదు. సోమవారం ఉదయం తెనుగుపూడి సమీపంలోని కిల్లి జోగి నాయుడు చెరుకు తోటలో అప్పారావు మృతదేహం పొలం పనులకు వచ్చిన కూలీలకు కంటపడింది. ఈ సమాచారం గ్రామస్తులకు తెలియడంతో మృతుడి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థలంతా సంఘటన స్థలం వద్దకు చేరుకొని విచారం వ్యక్తం చేశారు. మృతుడు అప్పారావుకు భార్య దుర్గ లక్ష్మి, ఇద్దరు పిల్లలు పూర్ణచంద్ (10), శ్యామ్ కళ్యాణం (12) ఉన్నారు. అప్పారావు మృతి చెందడం గల కారణాలు తెలియరా లేదు. స్థానిక నాయకులు, మాజీ సర్పంచ్ ఆవుగడ్డ కోటిపల్లి నాయుడు, కిల్లి గోవింద మృతుడి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. మృతుడి భార్య ఫిర్యాదు తో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగేంద్ర తెలిపారు. యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం

### ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్ : ఎల్బీ సుశీల



కేకోటపాడు, ఆగస్టు 5, మేజర్‌న్యూస్: తల్లిపాల విశిష్టతపై పలువురు గర్భిణీలకు, బాలింతలకు స్థానిక ఐసిడిఎస్ ప్రోజెక్ట్ సూపర్వైజర్ ఎల్ బి సుశీల అవగాహన కల్పించారు. తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా సోమవారం ఉదయం మేడిచర్ల అంగన్వాడి సెంటర్ లో అంగన్వాడి సిబ్బంది, మహిళా పోలీసులు, ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎల్ బి సుశీల మాట్లా డారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు అందించాలని తల్లిపాలలో వ్యాధినిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని చెప్పారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్, అంగనవాడి ఆయాలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# పాఠశాలల్లో కూరగాయలు పెంపకం చేపట్టాలి

### ఎంపీడీవో పైల సూర్యనారా యణ వెల్లడి



గరుగుబిల్లి, ఆగస్టు 5, మేజర్‌న్యూస్: మాతోట కార్యక్రమం లో భాగంగా మండలంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలతో పాటు, మండల పరిషత్తు ప్రాథమి కోన్నత పాఠశాలల్లో కూరగాయలు పెంపకం చేపట్టాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పైల సూర్యనారాయణ తెలిపారు. మండల కేంద్రంలో ని ఎమ్మార్సీ భవనంలో సోమవారం మండల పరిధిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు, మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాల ల ప్రధానోపాధ్యాయులతో పాఠశాలలో కూరగాయలు పెంపకం మరియు విద్యా కమిటీ ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భం గా ఎంపీడీవో సూర్యనారాయణ మాట్లాడుతూ మాతోట కార్యక్రమం లో భాగంగా పాఠశాల ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో కాయగూరల తో పాటు ఆకుకూరలను పెంపకం చేపట్టాలని ప్రధానోపాధ్యాయులను కోరారు. మాతోట కార్యక్రమంలో భాగంగా పెంపకం చేపట్టిన ఆకుకూరలు, కాయగూరలను మధ్యాహ్న భోజనం పథకంలో విద్యార్థులకు ఉపయోగించాలని పేర్కొన్నారు. అదేవిధంగా విద్యా కమిటీ ఎన్నికలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించాల్సి ఉందని ప్రధానోపాధ్యాయులకు తెలియజేశారు.

ఈకార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారి నగిరెడ్డి నాగభూషణ రావు, మండల విద్యాశాఖ అధికారి (2) కె కొండలరావు, గరుగుబిల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ ఎల్ పాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తు కోసం పొదుపు చేసి బంగబడ్డారు

### సహారా ఇండియా సొమ్ము చెల్లించండి



దేవరాపల్లి, ఆగస్ట్ 5, మేజర్‌న్యూస్: భవిష్యత్తు కోసం పొదుపు చేసి బంగపడిన సహారా ఇండియా డిపాజిట్ సొమ్ము లబ్ధిదారులకు వెంటనే చెల్లించాలి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి. వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సిపిఎం మండల కార్యదర్శి బి.టి దోర అధ్యక్షతన మండల పార్టీ సమావేశం జరిగింది. అనంతరం వారు మాట్లాడారు. పైసా పైసా కూడా బెట్టి భవిష్యత్తులో ఉపయోగ పడాతాయని పొదుపు చేస్తే సంస్థ మోసం చేసిందని తెలిపారు.

దేశవ్యాప్తంగా రెండున్నర కోట్ల మంది బాధితులు సహారా ఇండియాలో దాచుకున్న డబ్బుకు ప్రభుత్వాలు బాధ్యత వహించాలని కోరారు. గతంలో ఎన్నో ఆందోళన ఫలితంగా కేంద్ర ప్రభుత్వం స్పందించి హెరీం మంత్రి అమిత్ షా నాయకత్వంలో గత సంవత్సరం క్రితమే పంపిణీ చేస్తామని అయితే దశలవారీగా పంపిణీ చేసి లబ్ధిదారులందరికీ న్యాయం చేస్తామని ప్రకటించారని కానీ ప్రభుత్వం నేటికీ పూర్తి స్థాయిలో పంపిణీకి చర్యలు చేపట్టడం లేదన్నారు దీనిపై త్వరలోనే కార్యచరణ రూపొందించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఏజెంట్లు లబ్ధిదారులు సహకారాన్ని అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ దేముడు, డి. శంకర్ కె. ఈశ్వరావు, జె. ఈశ్వరావు బి. నాగేశ్వరరావు, వి.దొంగబాబు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలు బిడ్డకు మంచి ఆరోగ్యం



నక్కపల్లి, ఆగస్ట్ 5, మేజర్‌న్యూస్: మండలంలోని ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా గునిపూడి,కాగిత అంగన్ వాడి కేంద్రంలో బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత, ముర్రుపాల ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగిందని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్ వైజర్ సత్యవథి,కార్యకర్త ఝాన్సీ తెలిపారు. ఈ సందర్భంగా గునిపూడి,కాగిత కేంద్ర పరిధిలో ఉండే బాలింతలకు తల్లిపాలు బిడ్డలకు మంచి ఆరోగ్యం ఉంటుందనీ తెలిపారు. గునిపూడి లో బియ్యపు గింజలతో చేసిన తల్లిపాలు చిత్రం పలువురిని ఆకట్టుకుంది. తల్లిపాల ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రతిరోజు తీసుకోవలసిన ఆహారం, ఆరోగ్య సూత్రాలు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నరసింగరావు, మహిళా పోలిసు సునీత,డిజిస్టల్ అసిస్టెంట్ శ్రీనివాస్,ఎ ఎన్ ఎం భారతి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం మహిళ పోలీస్ నూర్జహాన్ మిషన్ వందరోజుల కార్యక్రమాలలో భాగంగా సోమవారం బుచ్చిరాజుపేట గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.తల్లిపాలతోనే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారంటూ శనివారం మండలంలో బుచ్చిరాజుపేట గ్రామంలో వివిధ కార్యక్రమాలను అంగన్వాడీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది సంయుక్తం కలిపి చేపట్టారు. అంగన్వాడీ కార్యకర్త పి. రమణమ్మ ఆధ్వర్యంలో భోదన విరామం సమయంలో హాజరైన మహిళ పోలీస్ నూర్జహాన్ మాట్లాడుతూ పోషకవిలువలు తీసుకోవడంవలన కలిగే ఉపయోగాలను వారికి వివరించారు.దీనిలో భాగంగా స్థానిక అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీస్త్రీలు, తల్లుల సమక్షంలో అంగన్వాడీ సిబ్బంది చేపట్టిన ఆకృతి పలువురునాకట్టుకుంది. ఏఎన్ఎం సింహాచలం ,ఎమ్ ఎల్ హెచ్ పి. సాయి పద్మ, ఆశ కార్యకర్త,. లక్ష్మి తల్లులు పాల్గొన్నారు గర్భిణీ స్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్యం అందాలి : ఎమ్మెల్యే



పార్వతీపురం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్: ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే బోనల విజయ్ చంద్ర అన్నారు. నియోజకవర్గం పరిధిలో గల సితానగరం మండలం పెదంకలాం,సితాగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(%ూఁజ%)ను సోమవారం ఆయన ఆకస్మికతనికి సందర్శించారు. వైద్యులు ,సిబ్బంది హాజరు పరిశీలించి రోజువారి వైద్యం కోసం వస్తున్న రోగులకు వివరాలను తెలుసుకున్నారు. ఆసుపత్రి మొత్తం పర్యటించి ఏ ఏ సమస్యలు ఉన్నాయో...? ఆసుపత్రికి వస్తున్న రోగులు వారికి అందుతున్న సేవలు పై ఆరా తీశారు.వైద్యులు ఎంతమంది ఉన్నారు సిబ్బంది ఎంతమంది ఉన్నారు తదితర పరిస్థితులను చూశారు. ఆసుపత్రిలో సానిటేషన్ పనిపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నిత్యం రోగులు ఉండే ఆసుపత్రిలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి అని సూచించారు వ్యాధి నిర్ధారణ పరీక్ష పరిశీలి తదితర అంశాలపై ఆరా తీశారు . ఆసుపత్రిలో సేవలు పరిస్థితిపై రాజీలేదని ప్రభుత్వపరంగా అన్ని విధాల ప్రోత్సాహం ఉంటుందని భరోసా ఇచ్చారు.

## ఉడుపులవుతున్న వరి పొలాలని సందర్శించిన భీమిలి వ్యవసాయ అధికారి



భీమునిపట్నం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్: భీమిలి మండలం, సింగనబంద గ్రామంలోని ఉడుపులు అవుతున్న వరిపొలాలని భీమిలి మండల వ్యవసాయాధికారి బి. శివ కోమలి సందర్శించడం జరిగింది. నాట్లు పై పైన నాటితే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశం ఉంటుందని తెలిపిరి. నాటిన తరువాత ప్రతీ 2 మీటర్లుకి 30 సెంటీమీటర్ల బాటలు తీయటం వల్ల పైరుకు గాలి వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి కొంతవరకు అదుపు చేయవచ్చని, ఎరువులు, పురుగుమందులు కలుపు మందులు వెయ్యటానికి ఇంకా పైరు పరిస్థితిని గమనించడానికి ఈ బాటలు ఉపయోగపడతాయని తెలిపిరి. వరి రకాల కాలపరిమితిని బట్టి చదరపు మీటర్ కి కుదుళ్ళ సంఖ్యను నిర్ధారించుకోవాలని సూచించితిరి. ఉడుపు చేసేముందు వరి నారు చివర్లను సమానంగా త్రుంచటం ద్వారా గ్రుడ్డు దశలో ఉన్న ఆకుముడత పురుగు, కాండం తొలిచే పురుగులను నివారించుకోవచ్చని దీని వల్ల ప్రధాన పొలం లో 20 రోజుల వరకు ఈ పురుగుల తాకిడి ఉండదని తెలిపిరి. ప్రధాన పొలం లో ఊద మరియు ఏక వార్షిక గడ్డి జాతి మొక్కల నివారణకు ఉడిచిన 3-5 రోజుల్లోపు పలచగా నీరు పెట్టి 500 మిల్లి లీటర్ల ప్రెటిలక్లోర్ 50% మందును 25 కేజీల పొడి ఇసుక లో కలిపి సమానంగా వెద చల్లటం ద్వారా లేదా 35-50 గ్రాముల ఆక్సాడయార్జిల్ 80% పొడి మందును 500 మిల్లి లీటర్ ల నీటిలో కలిపి ఎకరాకు 20కేజీల పొడి ఇసుకలో కలిపి చల్లాలి అని తెలిపిరి. వీరితో పాటు రైతు సేవ కేంద్రం సిబ్బంది హరీష్, రమేష్ పాల్గొన్నారు.

### విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని

## రాష్ట్ర ప్రభుత్వం మంచి ఆలోచన చేస్తుంది

### చీపురుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు



గుర్ల, ఆగస్టు 5, మేజర్‌న్యూస్: సోమవారం గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యా ర్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ కాలేజీ విద్యార్థులకు 10వ తరగతి విద్యార్థుల కు పాఠ్య పుస్తకాలను సకాలంలో మంచి పేరు ప్రభుత్వం తెచ్చుకుందన్నారు ముఖ్యంగా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి చొరవ వలన పుస్తకాలు సకాలంలో అందించడం జరుగుతుంది అన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకొని మంచి పేరు ప్రఖ్యాత తీసుకురావాలన్నారు చెడు అలవాటులకు దూరంగా ఉండాలని మంచి అలవాట్లు నేర్చుకోవాలి అన్నారు మత్తు మద్యం తదితర వాటికి దూరంగా ఉండాలి అన్నారు. మంచి ఆలోచన చేసి మంచి భవిష్యత్తు పొందాలన్నారు గల్లీ నుంచి ఢిల్లీ వరకు గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రథమ స్థానంలో నుంచి మంచి ఉద్యోగాలు సాధించాలన్నారు ప్రతి విద్యార్థికి తాము అండగా ఉండి వారికి ఈ ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుంది అన్నారు ఈ కార్యక్రమంలో త్రిమూర్తులు రాజు తో పాటు ఎంపీపీ పొట్నూరు ప్రమీల జడ్పిటిసి అప్పలనాయుడు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి సన్యాసినాయుడు కిరణ్ కుమార్ రాజు సిహెచ్ మహేశ్వర రావు సన్యాసినాయుడు సూర్యనారాయణ అప్పలనాయుడు రాము నాయుడు టి శ్రీనివాసరావు దుర్గాసి కోటేశ్వరరావు తో పాటు గ్రామ సర్పంచ్ ఎంపీటీసీ తెలుగుదేశం పార్టీ నాయకులు కాలేజీ ప్రిన్సిపాల్ సిబ్బంది తాసిల్దారు ఆదిలక్ష్మి ఎంపీడీవో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు మేలు చేసే విధానాలను

## రూపకల్పన చంద్రబాబు చేస్తారు

### చీపురుపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు



గుర్ల, ఆగస్టు 5, మేజర్‌న్యూస్: సోమవారం మండలంలో తాత వారి కిట్టలి గ్రామం సమీపంలో ఉన్న గడి గడ్డ రిజర్వాయర్ సాగునీటి కాలువ నీరు విడుదల కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఏకైక జలాశయం అయినా గడిగడ్డ రిజర్వాయర్ సాగు నీటిని విడుదల చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జలాశయం దిగువన సుమారు రెండు వేల తొమ్మిది వందలు ఎకరాలకు సాగునీరు అందిస్తుంది అన్నారు అయితే ప్రస్తుతం సాగునీరు తక్కువగా ఉందని వర్షాలు శాతం కూడా తక్కువ ఉందన్నారు. అయితే నీటిని పొదుపుగా వాడుకోవాలిఅన్నారు. రైతుల సమస్యలు తమ దృష్టికి వచ్చిందన్నారు వాటిని పరిష్కరించే బాధ్యత కూడా తీసుకుంటామన్నారు ఈ కార్యక్రమాలో జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారులు మండల శాఖ అధికారులు తాసిల్దారు ఆదిలక్ష్మి ఎంపీడీవో వెంకటరావు మండల అధికారితో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు త్రిమూర్తులు రాజు సన్యాసినాయుడు కిరణ్ కుమార్ సిహెచ్ మహేశ్వర రావు టి శ్రీనివాసరావు దుర్గాసి కోటేశ్వరరావు దాసరి శివప్రసాద్ రామునాయుడు జనసేన నాయకులు శ్రీనివాసరావు నాగులపల్లి నారాయణరావు ఎంపిటిసి జోగి నాయుడు సోమినాయుడు వివిధ గ్రామాల రైతులు.

## గిరిజన ప్రాంతాల్లో తల్లిపాల వారోత్సవాలు



పార్వతిపురం రూరల్, ఆగస్టు 5, మేజర్‌న్యూస్: మండలంలోని శివారు గిరిజన ప్రాంతాల్లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. డోక్సెల సెక్టార్ పరిధిలో గల సూపర్వైజర్ బంగారమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సోమవారం జరిగింది. డీకే పట్నం పరిధిలో గల అంగన్వాడి కేంద్రాల యొక్క కార్యకర్తలు ,గర్భిణీలు, బాలింతలు ఇందులో పాల్గొన్నారు. తల్లిపాల యొక్క ఆవశ్యకతను వివరిస్తూ గిరిజన గర్భిణీలో బాలింతలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సక్రమంగా పౌష్టికాహారం తీసుకొని సంపూర్ణ ఆరోగ్యంతో శిశువులకు జన్మనివ్వాలని ప్రతి ఒక్కరూ ప్రసవ సమయంలో ఆసుపత్రికి వెళ్లాలని అన్నారు. క్రమం తప్పకుండా ప్రతి ఒక్కరూ సక్రమంగా అంగన్వాడీ కేంద్రాలకు వచ్చి ప్రభుత్వం ఇస్తున్న పౌష్టికాహారం తీసుకెళ్లాలని అలాగే నెలసరి పరీక్షలు చేయించుకోవాలని అన్నారు ఇబ్బందులు పడకుండా ముందస్తుగానే ఎప్పటిక ప్పుడు రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

## పెద్దూరులో తల్లిపాలు వారోత్సవాలుపై ర్యాలీ

### -అంగన్వాడి వర్కర్ లు గుణవతి, ఈశ్వరమ్మల, ఆధ్వర్యంలో ర్యాలీ -తల్లిపాలు వారోత్సవాల ఆవశ్య కతను తెలియజేసిన హెచ్ వి ఉదయకుమారి



గరుగుబిల్లి, ఆగస్టు 5, మేజర్‌న్యూస్: తల్లిపాలు వారోత్స వాలు సందర్భంగా సోమవారం మండల పరిధిలోని పెద్దూరు గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తలు ఇప్పిలి గుణవతి, ఈశ్వరమ్మ, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా తల్లిపాలు వారోత్స వాల ఆవశ్యకతను తెలియజేస్తూ ర్యాలీని నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ విజిటర్ చింతాడ ఉదయకుమారి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఇవ్వడంవల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని బిడ్డకు అనారోగ్యాల నుండి దూరం చేస్తుందన్నారు. తల్లిపాలుతో శిశు మరణాలు తగ్గించవచ్చని పేర్కొ న్నారు. అంగన్వాడీ వర్కర్లు గుణ వతి ,ఈశ్వరమ్మలు మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు న్యుమోనియా, అతిసార వ్యాధి వంటి ప్రమాద కరమైన వ్యాధుల నుండి రక్షిస్తుం దని తెలిపారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాటకరంగంలో వినూత్న ప్రయోగం



నక్కపల్లి, ఆగస్టు 5, మేజర్‌న్యూస్: శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని సాంఘిక రంగంలో వినూత్న ప్రయోగం చేపట్టినట్లు ద్విశత నాటక దర్శకుడు కొప్పిశెట్టి సత్య శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఉదయం తిమ్మాపురం శివారు కోనవానిపాలెం గ్రామంలో గ్రామ నాయకుడు కోన అప్పలరాజు నేతృత్వంలో శ్రీకృష్ణ జన్మాష్టమికి గ్రామంలోని అందరూ విద్యార్థినులచే లక్ష్మణగీత సాంఘిక నాటకం రిహార్సల్స్ ను, మునగపాక గ్రామానికి చెందిన నాటక రచయిత దాడి జగన్నాధరావు, గ్రామపెద్దల సమక్షంలో ప్రదర్శించారు. విద్యార్థినులంతా పదిహేను నుండి ఇరవై రెండు సంవత్సరాలలోపు వారు కావడం పన్నెండు మంది విద్యార్థినులతో సాంఘిక నాటకం ప్రదర్శనకు సిద్ధం కావడం నాటకరంగ చరిత్రలో ఈ ప్రాంతంలో మొదటి ప్రయోగంగా రచయిత జగన్నాధరావు అభివర్ణించారు. నాటకం తిలకించేందుకు రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా రానున్నందున ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామ నాయకుడు అప్పలరాజు తెలిపారు. నాటకం విజయవంతం కావాలని కోరారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని పెద్దలు వంగలపూడి గోవిందరావు, మామిడి నాగరాజు, కోన దుర్గాప్రసాద్, కోన రాజేష్ ,నటులు ముత్తా గోవిందరావు, నాగం వాసు తదితరులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## వార్డు పర్యటించిన మున్సిపల్ కమిషనర్



పార్వతీపురం రూరల్, ఆగస్టు 5, మేజర్‌న్యూస్: పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ సుడిగాలి పర్యటన చేశారు. ఎక్కడ కూడా మురికి నీరు నిల్వ ఉండకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సోమవారం కమిషనర్ కే శ్రీనివాస రావు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి కాలువలు పూడికలు తొలగించారు. బంధం వారి వీధి, విజయరామరాజు కాలనీ, మెయిన్ రోడ్డులో జరుగుతున్న స్పెషల్ శానిటేషన్ పనులను ఆయన పరివేక్షించారు. అలాగే బెల గాం వాటర్ ట్యాంక్ వద్ద తాగునీటిని పరిశీలించారు. పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో మంచినీరు అందాలని ఈ సందర్భంగా ఆయన ట్యాంక్ నిర్వాహకు లకు ఆదేశాలు చేశారు వర్షాలు కురుస్తున్న వేళ క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలని అన్నారు. అలాగే పట్టణంలోని 1,2,3,4,13,14 వార్డుల పరిధిలో గల పలు ప్రాంతాల్లో గ్యాంగ్ వర్కుల్లో భాగంగా కాలువ పూడికలు, యాంటీ లార్వా స్ప్రేయిం గ్, ఫాగింగ్ మొదలగు పారిశుద్ధ్య పనులు చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ మురళి, వెంకట్రావు, అచ్చుత్, మేస్త్రి సాయి పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

### సి డి పి ఓ విజయకుమారి



కొయ్యూరు, ఆగస్టు 5, మేజర్‌న్యూస్: మండల కేంద్రంలో సోమవారం తల్లిపాలయొక్క ప్రాముఖ్యత గురించి వివరిస్తూ రాజేంద్ర పాలెం నుండి గుడ్లప ల్లి కూడాలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలలో భాగంగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సి డి పి ఓ తెలిపారు.కొంతమంది తల్లులకు తల్లిపాల పట్ల అపోహలు తొలగిస్తూ తల్లిపాల సంస్కృతిని పెంచాలి అనే ఉద్దేశ్యం తో అందరి కార్యకర్తల కు అవగాహన కల్పించారు. మరియు 10 మంది గర్భిణీ స్త్రీ లకు సీమంత కార్యక్రమం నిర్వహిచారు.ఈ కార్యక్రమానికి ఏఎన్ఎం ఆశ, పి హెచ్ ఎన్ భవాని, వెలుగు ఏపిఎం గాంధీ, మరియు సూపర్వైజర్ సునీత, బాలామణి కొండమ్మ హాజరయ్యారు.

## ట్యాంకులు శుభ్రపరుస్తున్న
# దృశ్య రేపు నీటి సరఫరా చేయబడదు



**నర్సీపట్నం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** నర్సీపట్నం పురపాలక సంఘము నందు గల దుగ్గాడ వాటర్ వర్క్సు బలిఘట్టం వాటర్ వర్క్సు నందు గల నీటి సరఫరా సంపులును తేది.07-08-2024 న శుభ్ర పరుచుట మరియు ఇతర నీటి సరఫరా నిర్వహణ కార్యక్రమముల దృష్ట్యా తేది.07-08-2024న నర్సీపట్నం పురపాలక సంఘము పరిధిలో గల అన్నీ ప్రాంతములుకు నీటి సరఫరా నిలిపి వేయుడమగునని కమిషనర్ పూడి రవిబాబు తెలిపారు.

# సీతంపేటలో నిర్మాణంలో ఉన్న పౌల్ట్రీలో చోరీ

### -ఇనుప మెస్ కట్ చేసి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు
### -రూ. 32 వేలు విలువ చేసే విద్యుత్ వైర్లు అపహరణ



**దేవరాపల్లి, ఆగస్ట్ 5, మేజర్‌న్యూస్:** నాగయ్యపేట పంచాయితీ సీతంపేట శివారులో నిర్మాణంలో ఉన్న విజయ దుర్గ ఫౌల్ట్రీ ఫామ్ లో ఆదివారం రాత్రి దొంగలు చొరబడ్డారు. కోళ్ల ఫారం చుట్టూ వేసిన ఇనుప మెస్ ను కట్ చేసి లోపలికి ప్రవేశించారు. కోళ్ల ఫారంలో వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు సుమారు రూ. 32 వేలు విలువ చేసే విద్యుత్ వైర్లను అపహరించుకుపోయారు. దీనిపై పోలీస్ కు పిర్యాదు చేయగా స్థానిక ఎస్ఐ డి. నాగేంద్ర సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు కోళ్ల ఫారం నిర్వాహుకులు తెలిపారు.

# గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు

### బలియాసాయి గ్రామానికి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన



**పలాస, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం మందస గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్టు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా, పలాస నియోజకవర్గం, మందస మండలం, బలియాసాయి గ్రామానికి రోడ్డు ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే శిరీష సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. గత వైసీపీ పాలనలో గిరిజన ప్రాంతాలు పూర్తిగా నిరాదరణకు గురయ్యాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన రోడ్లకు కనీసం వైసీపీ ప్రభుత్వం ప్యాచ్ వర్క్ చేయలేదని ఎద్దేవా చేశారు. గిరిజనుల అభ్యున్నతికి వినియోగించాల్సిన సబ్ ప్లాన్ నిధులను జగన్ ప్రభుత్వం పక్కదారి పట్టించిందని మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో మళ్లీ గిరిజనుల జీవితాల్లో వెలుగులు వస్తాయని ఆమె అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఆగస్టు 21న ఐక్యూ జెడ్9ఎస్ ప్రో 5జీ
# ఐక్యూ జెడ్ 9ఎస్ 5జీ విడుదల

**విశాఖపట్నం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** హై పెర్ఫార్మెన్స్ స్మార్ట్ ఫోన్ బ్రాండ్ ఐక్యూ తన అత్యంత ప్రతిష్టాత్మకమైన ఐక్యూ జెడ్9స్ సిరీస్ను 2024 ఆగస్టు 21న విడుదల చేయనుంది. ఐక్యూ 'జెడ్' సిరీస్ ఎప్పుడూ కదిలే యువ మల్టీటాస్కర్ ల కోసం రూపొందించబడింది. వారి వేగవంతమైన జీవనశైలికి అనుగుణంగా ప్రత్యేకమైన డిజైన్, పనితీరు అధునాతన కెమెరా సెటప్ ఖచ్చితమైన కలయికను వారు అభినందించారు. రాబోయే ఐక్యూ జెడ్ 9ఎస్ సిరీస్ 'ఫుల్లీ లోడ్ ఫర్ ది మెగాటాస్కర్స్' ప్రధానంగా కళాశాల విద్యార్థులు మరియు యువ నిపుణులు పని/అకడమిక్స్, సామాజిక జీవితం మరియు పాఠ్యేతర కార్యకలాపాలను సమతుల్యం చేస్తున్నారు మరియు వేగవంతమైన కనెక్టివిటీ మరియు అంతరాయం లేని వినోదం కోసం వారి అవసరాన్ని సమతుల్యం చేస్తున్నారు. ఐక్యూ జెడ్ 9ఎస్ సిరీస్ వారిని సులభంగా మల్టీటాస్క్ చేయడానికి శక్తివంతం చేస్తుంది. వారి బిజీ షెడ్యూల్లను సమర్థవంతంగా నిర్వహించడానికి మరియు రోజంతా కనెక్ట్ అవ్వడానికి వారికి సహాయపడుతుంది. ఐక్యూ జెడ్ 9ఎస్ ప్రో 5జి స్నాప్డ్రాగన్ 7 జెన్ 3 ప్రాసెసర్తో పనిచేస్తుంది మరియు ఆకట్టుకునే 8 ఎల్ం అన్టూ స్కోర్ ను సాధిస్తుంది. ఇది సెగ్మెంట్ యొక్క వేగవంతమైన కర్వ్ స్మార్ట్ ఫోన్ ఐక్యూ జెడ్9ఎస్ 5జీ మీడియాటెక్ డైమెన్సిటీ 7300 ద్వారా పనిచేస్తుంది మరియు 7ఎల్ం యాన్టుయు స్కోరును సాధిస్తుంది. ఐక్యూ జెడ్9ఎస్ ప్రో 5జీ, ఐక్యూ జెడ్9ఎస్ 5జీ రెండింటిలోనూ ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ (ఓఐఎస్)తో కూడిన 50 మెగాపిక్సెల్ సోనీ ఐఎంఎక్స్882 సెన్సార్, ఓఐఎస్తో 4కే వీడియో రికార్డింగ్, సూపర్ నైట్ మోడ్ ఉన్నాయి. ఐక్యూ జెడ్9స్ ప్రో 5జీలో అదనంగా 8 మెగాపిక్సెల్ అల్ట్రా-వైడ్ లెన్స్ ఉంది. ఇది మీ సృజనాత్మక అవకాశాలను విస్తృత దృష్టితో విస్తరించడానికి రూపొందించబడింది. ఈ కెమెరా ఫీచర్లు అసాధారణమైన ఫోటో మరియు వీడియో నాణ్యతను అందిస్తాయి, ప్రతి షాట్ను శక్తివంతమైన వివరాలు మరియు స్పష్టతతో మెరుగుపరుస్తాయి. ఏఐ ఎరేజ్, ఏఐ ఫోటో ఎన్హాన్స్మెంట్ ఫీచర్ ప్రతి షాట్కు ప్రో లెవల్ ఫినిషింగ్ ఇస్తుంది.

## అధునాతన హంగులతో
# సుజుకి ఎవెన్యూస్ 125
### ఎవెన్యూస్ 125ను ప్రారంభించిన ఎమ్మెల్యే గొండు శంకర్



**శ్రీకాకుళం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** మంచి మైలేజ్‌తో పాటు, అధునాతన ఇంజన్, హార్డ్‌వేర్‌ను కలిగిన సుజుకి అవెనిస్ 125 కొత్త రంగుల్లో మార్కెట్‌లోకి విడుదలైందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. స్థానిక పెద్దపాడు రోడ్డులోని సుజుకి మోటర్ సైకిల్ షో రూమ్ లో న్యూ వేరియంట్‌తో లుక్ సుజుకి ఎవెన్యూస్ 125 సిసి తో ఐదు కలర్స్ తో కొత్త వాహనాలు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇప్పటికే మార్కెట్లో మార్కెట్లో సుజుకి ఎవెన్యూ వాహనాలు అందుబాటులో ఉన్నాయని అయితే కస్టమర్ల కోరిక మేరకు ఐదు రంగులలో అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ వాహనాలను కొనుగోలు చేసి మా వ్యాపార అభివృద్ధిని సహకరించాలని షోరూమ్ మేనేజింగ్ డైరెక్టర్ అంధవరపు లక్ష్మణరావు కోరారు. స్కూటర్‌లోని ఫీచర్లలో బ్లూటూత్ కనెక్టివిటీతో కూడిన డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, కాల్, ఎస్ ఎంఎస్, వాట్సాప్ హెచ్చరికలతో పాటు టర్న్-బై-టర్న్ నావిగేషన్ వంటి ఫీచర్లు ఉన్నాయని చెప్పారు. స్కూటర్ సైడ్-స్టాండ్ కట్-ఆఫ్, యుఎస్‌బీ ఛార్జింగ్ సాకెట్, కాంబి బ్రేకింగ్‌తో కూడా వస్తుంది. ఈ కార్యక్రమంలో కోరాడ రమేష్, షోరూమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నందివానివలస సమీపంలో ఏనుగులు సంచారం

### -వరినారుమల్లు, కాయగూరల పంటల ధ్వంసం చేసిన ఏనుగులు -ఏనుగులు సంచారంతో భయాందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



**గరుగుబిల్లి, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని నంది వానివలస గ్రామ సమీపంలో ఏనుగులు సోమవారం సంచరిం చాయి. గ్రామం సమీపంలోని సంచరించిన ఏనుగులు తామర చెరువులో కొంతసేపు సేద తీరాయి. కొమరాడ, జియ్యమ్మ వలస, మండలాల్లో సంచరించిన ఏనుగులు సోమవారం నంది వానివలస గ్రామ సమీపంలోకి ప్రవేశించాయి. నందివానివలస గ్రామ సమీపంలోకి ప్రవేశించిన ఏనుగులు వరి నారుమళ్ళు, ఇటీవల చేపట్టిన వరి ఉబాలతో పాటు, కాయగూరల పంటలను, ధ్వంసం చేయడంతో తీవ్ర నష్టాలకు గురయ్యామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాయగూరల పంటలు చేతికందు తున్న సమయంలో ఏనుగులు మొత్తం పాడు చేశాయని పలువురు రైతులు తెలిపారు. ప్రస్తుతం ఏనుగుల గుంపు సంచ రిస్తుండడంతో పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టాలకు గురైన రైతులకు పరిహారం చెల్లిం చేందుకు చర్యలు చేపట్టాలని రైతులు పేర్కొంటున్నారు. అదేవిధం గా ఈప్రాంతం నుంచి ఏనుగులను తరలించేందుకు చర్యలు చేపట్టా లని డిమాండ్ చేస్తున్నారు.

# మోదీ కొనసాగడమంటే దేశం కుల, మత, ప్రాంతాల వారీగా విచ్ఛిన్నం కావడమే

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జీ. ఈశ్వరయ్య



**విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** భారత కమ్యునిస్టు పార్టీ సీపీఐ విజయనగరం జిల్లా జనరల్ బాడీ సమావేశం స్థానిక అమర్ భవనం నందు జిల్లా కార్యదర్శి ఒమ్మి రవణ అధ్యక్షతన జరిగింది ఈ సంధ్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జీ.ఈశ్వరయ్య మాట్లాడుతూ దేశాన్ని బడా వ్యాపారుల చేతుల్లో పెట్టిన మోదీ ప్రభుత్వం వారికి వత్తాసు పలుకుతోందని విమర్శించారు. బడాబాబులు చేసిన 16లక్షల కోట్లు అప్పులను మోదీ రద్దు చేశారనీ చెప్పారు దేశంలో 700 మంది 43 లక్షలు అప్పులు తీసుకున్నారని తెలిపారు.దేశ సంపద కొద్ది మంది చేతుల్లోనే పోగుపడిందనీ,వాటిని పేదలకు పంపిణీ చేయాల్సి వుందన్నారు.కేంద్ర బడ్జెట్ లో ఎపికి నిధుల వరదన్నారనీ,అసలు మన రాష్ట్రానికి ఎంత వచ్చిందన్న విషయంలో తలోమాటా మాట్లాడారన్నారు.ఎపికి 56వేల కోట్లని ఒకరంటే గుంటూరు ఎంపి 86వేల కోట్లన్నారనీ చెప్పారు.48 లక్షల కేంద్ర బడ్జెట్ ఎపి రాజధాని కి 15వేల కోట్లన్నారనీ,అది కూడా గ్రాంట్ కాదనీ ప్రపంచ బ్యాంకు అప్పన్నారు.రాష్ట్రానికి రైల్వే జోన్ రాలేదనీ,ఏమంటే స్థలం లేదంటున్నారనీ,ఐదేళ్లకాలంలో జగన్మోహన్ రెడ్డి ఏంచేసారని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో పట్టు పెంచుకోవాలనీ,ప్రజా సంఘాలు పెరగాలన్నారు.ప్రజల సమస్య కోసం పోరిడేవారిని ప్రజలు తప్పక గుర్తిస్తారన్నారు. రాష్ట్రంలో భూ కబ్జాలు అసైన్డ్ భూముల ఆక్రమణలు జరిగాయనీ,ఈ నెల 20న విజయవాడలో భూ బాధితుల సదస్సు నిర్వహిస్తామని తెలిపారు.విజయనగరం లో తొలిసారిగా నవంబర్ 28 నుంచి మూడు రోజుల పాటు ఎ ఐ ఎస్ ఎఫ్ మహా సభలు నిర్వహిస్తున్నామనీ,వాటిని విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు.వేలాది మంది విద్యార్థులు,యువజనులు మహా సభలకు సమాయత్తమవుతున్నారన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి కామేశ్వరరావు మాట్లాడుతూ విజయనగరం జిల్లా పోరాటాలకు కొత్త కాదనీ,అలాగే వలసలకు కొత్తకాదన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబాటు తనం పోయేందుకు సిపిఐ మాత్రమే ఎన్నో ఉద్యమాలుచేసిందన్నారు. విభజన తర్వాత ప్రత్యేక హెూదాపై పోరాడిందనీ అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసిందనీ చెప్పారు.

రాష్ట్రంలో ఏ జిల్లాలోలేనంతగా భూ పట్టాలు పంపిణీ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో జరిగిందన్నారు. అసంఘటిత కార్మికుల హక్కులను కాపాడడంపనిభద్రత కల్పించేందుకు పోరాడిందన్నారు. రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం చేశామనీ, జిందాల్ భూములు, ఎయిర్ పోర్ట్, పోలవరం ఎడమకాలువ అంశాలలో జిల్లా సమితి పోరాటం.చేసిందనీ కామేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయకార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ రంగరాజు, రవణమ్మ, అప్పన్న, నాగభూషణం, జిల్లా సమితి సభ్యులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు సత్వరమే పరిష్కారం

**పలాస, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో అమలు చేసిన విద్యారంగ సంస్కరణల ఫలితంగా రాష్ట్ర విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, ప్రభుత్వ పాఠశాలలపై తలిదండ్రుల విశ్వాసం సడలిపోతుందని, ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమైపోతున్నాయని ఏపీ యునైటెడ్ టీచర్ ఫెడరేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీషకు సోమవారం వినతిపత్రం అందజేశారు. జిఓ 117 రద్దు చేయాలని, ప్రీప్రైమరీతో పాటు 1 నుంచి 5 తరగతులను ఒకే పాఠశాలగా నడపాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్ ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని విజ్ఞప్తి చేసారు. హైస్కూల్ లో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించి పనిభారం తగ్గించాలని కోరారు. హైస్కూల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని, ఒక కిలోమీటర్ పైబడి దూరం నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని, స్థానిక ప్రాంతాల పరిస్థితుల రీత్యా మధ్యాహ్న భోజన పథకం మెనూ సవరించాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పోస్టులను అప్ గ్రేడ్ చేయాలనీ, ప్రమోషన్లు, బదిలీలు వెంటనే చేయాలనీ కోరారు. మున్సిపల్ టీచర్ల పిఎఫ్ సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని, గిరిజన ప్రాంతాల్లో ప్లస్ టూ స్కూల్స్ ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న సిఆర్టలను, భాషా వాలంటీర్లను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలని కోరారు. కోవిడ్ సమయంలో మరణించిన మోడల్ స్కూల్ టీచర్ల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలని విజ్ఞప్తి చేసారు. మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్ వెంటనే విడుదల చేయాలని, ఎయిడెడ్ పాఠశాలల ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. మినిమమ్ టైం స్కేల్ ఉపాధ్యాయుల సర్వీస్లను రెగ్యులరైజ్ చేయాలని, ప్లస్ టూ పాఠశాలల్లో విజిటి పోస్టులకు ప్రమోషన్లు ఇవ్వాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలలకు రావలసిన అన్ని రకాల



గ్రాంట్లు మంజూరు వేయాలని, విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని, వేసవి సెలవులలో నాడు- నేడు, ప్లస్ టూ తరగతులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఈ అంశాలను సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో పి.నాగేశ్వరరావు, జిల్లా అకడమిక్ సెల్ కన్వీనర్ ఎల్.వి.చలం, కార్యదర్శి కే.రామారావు, ఎల్.ఢిల్లీరావు, జి.మధు, పలాస అధ్యక్షుడు సిద్దు, కార్యదర్శి ఎస్.వెంకటరమణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.చిట్టిబాబు, జి.కోదండరావు, కే.జయరాం, జిల్లా కార్యదర్శి జి.రమేష్, మందస అధ్యక్షా కార్యదర్శులు బి.జగదీశ్, డి.ఈశ్వర రావు, పి.జగన్మోహన్ రావు, కొండలరావు, ఎం.రాము, డి.మాధవరావు, ఎస్. ప్రేమ్ కుమార్, డి.ఈశ్వర రావు, కే.శ్రీనివాసరావు,ఎస్. రామారావు, సిహెచ్.చంద్రశేఖర్, టి.శ్రీనివాస్, టి.అప్పారావు, కే.పాపారావు, తదితరులున్నారు.

# బదిలీపై వెళ్తున్న ఎమ్మార్వో డి. రాజేశ్వరరావు



**కొయ్యూరు, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం ఎన్నికల విధులు లో భాగంగా కొయ్యూరు మండలం ఎమ్మార్వో గా వచ్చిన డి. రాజేశ్వరరావు విజయనగరం జిల్లా బండపల్లి మండలానికి బదిలీపై వెళుతున్న సందర్భంగా కొయ్యూరు మండల ఎంపీడీవో , పోలీస్ శాఖ , ఎమ్మార్వో ఆఫీసు సిబ్బంది ఘనంగా సత్కరించారు. సీనియర్ అసిస్టెంట్ దుమంతి సత్యనారాయణ, ఇతర సిబ్బంది ఎమ్మార్వో క్రింది ఉద్యోగుల పట్ల తీసుకున్న జాగ్రత్తలను మరియు ఎమ్మార్వో యొక్క పాలనా విధానాలని కొనియాడారు. అనంతరం వీఆర్ఏ సిబ్బంది, వీఆర్వో సిబ్బంది, డీటీ, ఆర్ ఏస్ డీటీ, సర్వేయర్లు తదితరులు శాలువా కప్పి పుష్ప గుచ్చాలి ఇచ్చి సత్కరించారు. సిబ్బంది అంతా కలిపి బంగారపు ఉంగరాన్ని జ్ఞాపికగా బహుకరించారు. అనంతరం కొయ్యూరు ఎస్సై మరియు ఎంపీడీవో దుస్సాలువ సాలువా తో జ్ఞాపికను అందించారు. అనంతరం ఎమ్మార్వో డి రాజేశ్వరరావు మాట్లాడుతూ తన కిందిస్థాయి ఉద్యోగులంతా ప్రతి విషయంలో తనతో పాటు ఉంటూ అంతా సహాయం చేశారని సిబ్బంది అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యంగా వీఆర్ఏ లోవరాజు వీఆర్వో పండయ్య వీఆర్వో మరియమ్మలను వీరికి ప్రత్యేక అభినందనలు ధన్యవాదాలు తెలిపారు. ఇంకా డిటి కే సీతారాం ను మీరు ఇన్చార్జిగా నియమితులు అవుతున్నారని కొయ్యూరు మండల ఖ్యాతిని ఇంకా పైకి తీసుకెళ్లాలని అన్నారు. ఇంకా ఎన్నికల కాలంలో జరిగిన కొన్ని సంఘటనలు గుర్తు చేస్తూ మఠం భీమవరం ఒక బూతు వద్ద ఒక్క ఓటు మాత్రమే ఉన్న అక్కడికి వెళ్లి ఆ ఓటును వేయించి వచ్చిన ఎంపీడీవో సీతయ్యను పొగడ్తలతో ముంచెత్తుతూ తనకి ధన్యవాదాలు తెలియజేశారు. పోలీసు వ్యవస్థ ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో ఎలక్షన్ విధులు నిర్వహించడంతో ఎలక్షన్ టైం లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని పోలింగ్ అంతా ప్రశాంతంగా పూర్తయిందని అంతేకాకుండా గత రెండు వారాల క్రితం యువకుని అదృశ్య ఘటనను గుర్తు చేస్తూ సెలవు దినమైన పట్టించుకోకుండా సెర్చ్ ఆపరేషన్ ను తన భుజాల మీద వేసుకొని దానిని పూర్తి చేసిన ఘనత కొయ్యూరు ఎస్సై రామకృష్ణకి దక్కుతుందని కొనియాడారు. ఆర్ ఎస్ డి టి అప్పన్న సివిల్ సప్లై విషయంలో నాకు 100% సహకరించినందుకు ప్రత్యేకదాని ధన్యవాదాలు తెలిపారు. ఇక్కడ ప్రకృతిని నేను ఎంతో ఆస్వాదించానని ఇక్కడ దేవతలు గుడులను అన్ని సందర్శించానని ఏడు నెలల ఉద్యోగంలో మండలంలో జరిగిన ప్రతి సందర్భాన్ని చాలా ఆస్వాదించానని మనస్ఫూర్తిగా వెళున్నానని ఒక ఇంత బావోద్వేగానికి గురయ్యారు. మీడియా మిత్రులను ప్రశంసిస్తూ మైదాన ప్రాంత మీడియాకి ఇక్కడ మీడియాకి వ్యత్యాసం చెప్పారు ఇక్కడ మీడియా మిత్రులు నిబద్ధతతో వ్యవహరిస్తూ వ్యవస్థలను ఇబ్బంది పెట్టకుండా బయట జరిగే ప్రతి విషయాన్ని అధికారులకు తెలియజేస్తూ ఉంటారని ఫోర్త్ ఎస్టేట్ అంటే ఈ మాదిరిగానే ఉండాలని మీడియా మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు అనంతరం ఎమ్మార్వో ఆఫీస్ సిబ్బంది అంతా కలిసి సంఘీభావంతో ఎమ్మార్వో రాజేశ్వరరావుకు వీడ్కోలు పలికారు.

# తోటపల్లి, నారాయణపురంలకు సాగునీరు విడుదల

### -రైతులు సాగునీటిని సద్వినియోగం కోవాలి
### -శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



**శ్రీకాకుళం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** నారాయణపురం, తోటపల్లి కుడి కాలువ ద్వారా పంట భూములకు ఈ నెల 6న సాగునీరు విడుదల చేయనున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. నగరంలోని పెదపాడు రోడ్డులో ఆయన విలేకరులతో సోమవారం మాట్లాడారు. గత ప్రభుత్వం నారాయణపురం, తోటపల్లి కాలువలకు సకాలంలో నీరు విడుదల చేయకపోవడంతో వేలాది మంది రైతులు తీవ్ర అవస్థలు పడ్డారని తెలిపారు. పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నా పట్టించుకోలేదని, పంటలకు నీరులేక.. ఏంచేయాలో తోచక దూర ప్రాంతాల నుంచి ఇంజన్లు పెట్టి అవస్థలు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నీరు అందక ఇబ్బందులు పడిన అన్నదాతల ప్రయోజనమే లక్ష్యంగా శివారు భూములకు సైతం నారాయణపురం, తోటపల్లి కాలువల ద్వారా సాగునీరందించి రైతులు అవస్థలు తీరుస్తామన్నారు. ఇప్పటికే తోటపల్లి రిజర్వాయర్ నుండి సాగునీరు విడుదలకు చర్యలు తీసుకున్నామని వివరించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు శ్రీకాకుళం నియోజకవర్గ రైతాంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అనేక చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగానే నారాయణపురం, తోటపల్లి సాగునీరు విడుదలకు సంబంధిత అధికారులతో మాట్లాడటం జరిగిందని ఎమ్మెల్యే గుండు శంకర్ తెలిపారు. ఈ మేరకు జలవనరుల శాఖ నార్త్‌కోస్ట్ సీఈతో మాట్లాడామని మంగళవారం నాటికి సాగునీటి విడుదలకు నార్త్ కోస్ట్ సీఈ అంగీకరించారని తెలిపారు. రైతాంగం సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శంకర్ కోరారు.

## అదృశ్యమైన యువకుడు
# రిజర్వాయర్లో శవమై కనిపించాడు



**రావికమతం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** మండలంలో చీమలపాడు పంచాయతీ దుకులంపాడు గ్రామానికి చెంది శనివారం అదృశ్యమైన యువకుడు సోమవారం కళ్యాణపులోవ రిజర్వాయర్లో శవమై కనిపించాడని కొత్తకోట ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. దూకులంపాడు గ్రామానికి చెందిన ఈదల చిన అప్పారావు ఉరఫ్ సంజీవ్ శనివారం బయటికి వెళ్లి వస్తానని ఇంటిదగ్గర చెప్పి తిరిగి రాలేదని అతని సోదరి కొత్తకోట పోలీస్ సైనికు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా సంజీవ్ కు చెందిన తువ్వాలు గ్రామానికి సమీపంలో కళ్యాణపులోవ రిజర్వాయర్ లో నాటు పడవపై ఉండడం గమనించిన ఎస్సై లక్ష్మణరావు ఆదివారం రిజర్వాయర్ లో గాలింపు చర్యలు చేపట్టారు. ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో ఉన్నతాధికారులకు ఈ విషయం తెలియపరిచారు. ఈ నేపథ్యంలో రిజర్వాయర్ లో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు ఎస్సై లక్ష్మణరావు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు . మృతదేహం గుర్తులు ఆధారంగా అదృశ్యమైన సంజీవ్ గా కుటుంబ సభ్యులు ధ్రువీకరించారు. దీంతో శవ పంచనామ నిర్వహించి పోస్టుమార్టనికి మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## ముప్పై ఏళ్ళ సుదీర్ఘ పోరాటం
# ఫలితం ఎస్.సి.రిజర్వేషన్లు వర్గీకరణ



**విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** 30 సంవత్సరాల సుదీర్ఘ ఉద్యమ పోరాటంలో మాది రిజర్వేషన్ పోరాట సమితి పోరాట ఫలితం ఎందరో మాదిగ యువకుల బలిదానాల ఫలితముగా ఈరోజు సుప్రీంకోర్టులో వచ్చినటువంటి తీర్పు 100 సంవత్సరాల ఎస్సీలో ఉన్నటువంటి 59 కులాల భవిష్యత్తు కోసం ఈ ఈ తీర్పు చరిత్రలు నిలిచిపోతుందని, ఇది 59 కులాల రిజర్వేషన్ ఫలాలు పొందటంలో ఒక ముందడుగుగానే భావిస్తాము తప్ప ఎవరిని కింత పరిచయం అంట కాదు ఎవరు వాటం చెందినట్టు కాదని విషయాన్ని భావించమని జిల్లా రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు భోగి శ్రీను మాదిగ తెలియజేశారు,ఈ కార్యక్ర మంలో ఎం.ఆర్.పి.ఎస్.నాయకులు కుందేటి ప్రకాశ్, అలమండ అప్పారావు, చెలికి దాసు, చెలికి లక్ష్మణరావు, కుందేటి గణేష్, రేజేటి సాయి, మహిళా విభాగం జిల్లా నాయకురాలు కుందేటి పార్వతి, వరం తదితరులు పాల్గొన్నారు

# నగ్నేశ్వర స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు



**ఎలమంచిలి ప్రతినిధి, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** రాంబిల్లి మండలం దిమిలి గ్రామంలో చారిత్రిక నగ్న లింగేశ్వర స్వామి సన్నిధిలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం తొలి సోమవారం సందర్భంగా నగ్న లింగేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తు లు నగ్నలింగేశ్వర స్వామి, బాలా త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యే క పూజలు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మారుతి శర్మ పాల్గొన్నారు.

# అరసవల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

### -ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడం నా బాధ్యత
### -కనీస మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజల ఇబ్బందులను తీరుస్తా -అరసవల్లిలో పర్యటించిన శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



**శ్రీకాకుళం, ఆగస్టు 5, మేజర్‌న్యూస్:** అరసవల్లిని అన్ని విధాల అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని అరసవెల్లి ప్రాంతంలో సోమవారం ఆయన కమిషనర్ తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యే శంకర్ ను ఆహ్వానించి మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయం ఉన్న అరసవల్లి గ్రామంలో కనీసం మౌలిక సదుపాయాలు కల్పించలేని స్థితిలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని శంకర్ పేర్కొన్నారు. అరసవల్లి పరిధిలో అనేక సమస్యలు గుర్తించామని చెప్పారు. కనీసం మౌలిక సదుపాయాలు కల్పనలో కూడా గత వైసిపి ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ప్రజలకు సరైన రోడ్లు, కాలువలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి తెచ్చారని వివరించారు. ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గత వైసిపి ప్రభుత్వం అరసవల్లి లోని సమస్యలను ఏనాడూ కన్నెత్తి కూడా చూడలేదని పేర్కొన్నారు. తన విజయం కోసం సహకరించిన అరసవల్లి ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు కమిషనర్ చల్లా ఓబులేషు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అరసవిల్లి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.